


# విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 27-06-2023 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 237 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## వైఎస్సార్ లా నేస్తం పథకం విడుదల

- దేశంలో ఏపీలో తప్ప ఎక్కడా ఈ పథకం లేదన్న సీఎం జగన్
- మొత్తం రూ.6,12,65,000 డబ్బుల్ని జమ చేశారు
- ఐదు నెలలకు గాను ఒక్కొక్కరికి రూ.25వేలు ఇచ్చారు




తాడేపల్లి (విజయభాను న్యూస్) : వైఎస్సార్ లా నేస్తం పథకం నిధుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. లా నేస్త పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 2,677 మంది యువ న్యాయవాదుల అకౌంట్‌లలో నెలకు రూ.5 వేల స్టైఫండ్ చొప్పున 2023- 24 సంవత్సరానికి మొదటివిడత 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 5 నెలలకు గాను రూ. 25 వేల చొప్పున మొత్తం రూ.6,12,65,000 అకౌంట్‌లలో జమ చేశారు. నాలుగేళ్లగా లా నేస్తం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. మొత్తం 2677 మందికి రూ.6.12 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. లా కోర్సు పూర్తిచేసిన, మొదటి మూడేళ్లలో ప్రాక్టీసు పరంగా నిలదొక్కు కోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ పరిస్థితుల్లో వారి కాళ్లమీద వాళ్లు నిలబడేందుకు, వారికి తోడుగా నిలుస్తూ ప్రతి నెలా రూ.5వేలు, ఏడాదిలో రూ.60వేలు ఇస్తున్నామన్నారు. మూడేళ్లలో ఇలా ఒక్కొక్కరికీ రూ.1.8లక్షలు ఇస్తున్నామని.. దీని వల్ల వృత్తిలో వాళ్లు తరువాయి 2లో..

## దేశ పరిస్థితిని సమీక్షించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: అమెరికా, ఈజిప్టులో ఆరు రోజుల అధికారిక పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచ రులతో సోమవారం సమావేశ మయ్యారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితిని, ముఖ్యంగా మణిపూర్ పరిస్థితిని సమీక్షించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పురి, సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొ న్నారు. దీనికి ముందు అమిత్‌షా నేరుగా ప్రధానితో భేటీ అయ్యారు. మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితిని ప్రధానికి ఆయన వివరించినట్టు సమాచారం. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నాడు ఢిల్లీలో అమిత్‌షాను కలుకున్న నేపథ్యంలో మోదీతో అమిత్‌షా భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఏం జరుగుతోంది. ప్రధానమంత్రి ఇండియాకు తిరిగి రాగానే దేశంలో ఏమి జరుగుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర నాయకులను సైతం అడిగినట్టు తెలుస్తోంది. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నకు బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ సమాధానమిస్తూ, అంతా సజావుగానే సాగుతోందా అని నడ్డాను మోదీ ప్రశ్నించారని, ప్రభుత్వం తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను ప్రజల ముందుకు తీసుకువెళ్తున్నామని, అంతా సంతోషంగా ఉన్నారని నడ్డా సమాధానమిచ్చారని తెలిపారు.

### షాతో బీరేన్ సింగ్ భేటీ

మణిపూర్‌లో పరిస్థితిపై గత శనివారంనాడు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం, బీరేన్ సింగ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలని మెజారిటీ పార్టీలు డిమాండ్ చేయడం జరిగింది. ఈ క్రమంలో అమిత్‌షాను బీరేన్ సింగ్ ఆదివారంనాడు కలుసుకున్నారు. అనంతరం బీరేన్ సింగ్ ఒక ట్వీట్‌లో ఆ వివరాలు తెలిపారు. మణిపూర్‌లో పరిస్థితిని అమిత్‌షా సమీక్షించారని, ఆయన పర్యవేక్షణలో రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం గత వారంలో మణిపూర్‌లో హింసను చాలావరకు అదుపు చేసిందని చెప్పారు. జూన్ 13న హింస చెలరేగినప్పటి నుంచి ఎలాంటి మరణాలు సంభవించలేదని తెలిపారు. మణిపూర్‌లో యథాపూర్వ పరిస్థితి నెలకొనేందుకు కేంద్రం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని హోం మంత్రి భరోసా ఇచ్చినట్టు చెప్పారు.

## ఏపీపై అల్పపీడన ప్రభావం..

- ఏపీలోని పలు జిల్లాలకు వర్ష సూచన
- రుతుపవాలనకు తోడు అల్పపీడనం
- ఏపీలో జోరందుకున్న వర్షాలు
- ఈ నెల 29 వరకు వానలు పడతాయి

అమరావతి, (విజయభాను న్యూస్) : ఏపీ ప్రజలను వాతావరణశాఖ అలర్ట్ చేసింది. ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడే అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించి ఉత్తర ఒడిశా, జారండ్ మీదుగా పయనిస్తుందని ఐఎండీ అంటోంది. రాబోయే 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఉరుములు, గాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ తరువాయి 2లో..

## కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్..

ఉత్తరాఖండ్ : చార్‌ధామ్ యాత్రికులకు వాతావరణం పరీక్ష పెడుతోంది. ఏటా కేవలం ఎండాకాలంలో మాత్రమే అందు బాటులో ఉండే గంగోత్రీ, యమునోత్రి, బద్రీనాథ్, కేదార్‌నాథ్ యాత్ర.. అత్యంత క్లిష్టమైన ఆధ్యాత్మిక యాత్ర. ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ జిల్లాలో 3584 మీటర్ల ఎత్తులో ఉన్న కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకోవడం మామూలు విషయం కాదు. గత మూడు రోజుల నుంచి రుద్రప్రయాగ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కొండలు, కోనలు, ఆ పక్కనే లోయలు, నదులు.. ఇలాంటి భౌగోళిక పరిస్థితుల్లో ఆకస్మిక వర్షాలు రావడం, ఆ వెంటనే వరదలు పోటెత్తడం ఇక్కడ సాధారణం. తాజా వర్షాలు, వరదల కారణంగా కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్ ప్రకటించింది ఉత్తరాఖండ్ తరువాయి 2లో..

## గోదావరి జిల్లాల్లో ఒక్క సీటు కూడా వైసీపీకి రాకుండా చేస్తా

### జనసేన అధినేత పవన్ కల్యాణ్



నర్సాపురం, (విజయభాను న్యూస్) : గోదావరి జిల్లాల్లో కాలుష్య నివారణకు మాస్టర్ ప్లాన్ తీసుకొస్తామని జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు పశ్చిమ గోదావరి జిల్లా జనసేన కార్యకర్తలతో సోమవారం పవన్ సమావేశమయ్యారు. గోదావరి జిల్లాల అభివృద్ధితో పాటు కాలుష్య నివారణకు మాస్టర్ ప్లాన్ తీసుకొస్తామని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో పార్టీ కార్యకర్తలతో సోమవారం పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. విద్య, వైద్యం కొద్ది మంది చేతుల్లోనే ఉండకూడదని.. అధికారంలోకి రాగానే అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జనసేన పార్టీ మార్పు కోసం వచ్చిందని.. ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే పరిస్థితి లేదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఒక్క సీటు కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాకుండా చూసే బాధ్యతను తాను తీసుకుంటానని పునరుద్ఘాటిం చారు. మార్పు కోసం వచ్చిన తరువాయి 2లో..

## ఒకే రోజు పట్టాలెక్కనున్న 5 వందే భారత్ రైళ్లు..



దిల్లీ: కేంద్ర రైల్వే శాఖ ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికులనుంచి మంచి స్పందన వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం క్రమంగా ఈ రైళ్ల సంఖ్యను పెంచుతోంది. ఇప్పటికే 17 రూట్లలో ఈ సెమీ-హైస్పీడ్ రైళ్లు సర్వీసులు అందిస్తుండగా.. తాజాగా మరో ఐదు వందేభారత్ రైళ్లను ఒకేరోజు ప్రారంభించేందుకు తరువాయి 2లో..

## యుపిఎస్సి నిర్వహించు పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-జిల్లా రెవిన్యూ అధికారి ఎస్. శ్రీనివాస మూర్తి.



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** జులై 2వ తేదీన జిల్లాలో జరగబోవు యుపిఎస్సి పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు గావించాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్. శ్రీనివాస మూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం పరీక్ష నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల 2వ తేదీన యుపిఎస్సి నిర్వహించనున్న ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ ,అసిస్టెంట్ ప్రోవిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 11,520 మంది అభ్యర్థులు హాజరు అవుతారని, దీనికి 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . పరీక్ష ప్రారంభం అయ్యే ఒక గంట ముందు నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతించటం జరుగుతుందని, 10నిమిషాలకు ముందు నిలిపివేస్తారన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, తరువాయి 2లో..

## ఇది రాష్ట్రమా.. రావణ కాష్టమా..

### తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు



అమరావతి, (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన వరుస దుర్ఘటనలపై చంద్రబాబు ట్విటర్‌లో ఓ వీడియోను విడుదల చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బలహీనవర్గాల ప్రజలపై జరుగుతున్న దాడుల గురించి ప్రశ్నిస్తూ 'ఇది రాష్ట్రమా.. రావణ కాష్ఠమా' అంటూ వీడియో విడుదల చేశారు. నాలుగేళ్ల నరకం అంటూ ఇప్పటి వరకు జరిగిన సంఘటనలను ఇందులో ఉదహరించారు.

పదో తరగతి విద్యార్థి సజీవద హనం, ఏలూరు యాసిడ్ దాడిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదని చంద్రబాబు మండిపడ్డారు. నెల్లూరు, మచిలీపట్నం అత్యాచార ఘటనలపైనా నోరు మెదపలేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని శాంతిభద్రతలపై కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని దుయ్యబట్టారు. సీఎం జగన్మోహన్ రెడ్డి నిజంగా ప్రజల బిడ్డే అయితే.. దాడులు చేసిన సొంత పార్టీ నేతల్ని కాపాడతారా అని ప్రశ్నించారు. ప్రజల బిడ్డే అయితే.. పేదల ప్రాణాలకు వెలకట్టే పెత్తందారు అయ్యేవారా అని నిలదీశారు. రాబోయే రోజుల్లో గల్లీ నుంచి పట్టణాల వరకు ప్రజలకి జరిగిన అన్యాయాన్ని, వైసీపీ నాయకుల అక్రమాలను ఎత్తి చూపే విధంగా 'నాలుగేళ్ల నరకం' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా తరువాయి 2లో..



# శంభువానిపాలెం కు ఆర్టీసీ బస్సు ఏర్పాటు




మధురవాడ (విజయభాను న్యూస్) : 70 ఏళ్లగా బస్సు కోసం ఎదురు చుసిన శంభువానిపాలెం గిరిజన ప్రజలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది స్థానిక భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ ఆదివారం జండా ఊపి ప్రారంభించారు. మహా విశాఖ 6 వ వార్డు పరిధి శంభువానిపాలెం గ్రామా ప్రజలు సుదీర్ఘ కాలంగా రవాణా సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని గత నెలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ సమస్యను అవంతి దృష్టికి తీసుకు రావడంతో యుద్ధప్రాతిపదికన అధికారులతో సంప్రదించి ఆర్టీసీ బస్సును గిరిజనులు కోసం ఏర్పాటు చేసి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు సమస్యలు తెలుసుకోగలుగుతున్నామని, అందులో భాగంగానే శంభువానిపాలెం ప్రాంతంలోని గిరిజనులు రవాణా సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి కనీసం బస్సు సౌకర్యం లేని వీరికి ఈ సౌకర్యం కల్పించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. గిరిజనులమనే గుర్తింపు పత్రాలు లేవని, అదేవిధంగా అత్యవసర వేళల్లో కనీసం అంబులెన్స్ సర్వీస్ కూడా లేని పరిస్థితులలో తాము నివసిస్తున్నామని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. నగరంలోనే ఉంటున్నా ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి శంభువానిపాలెం గిరిజన ప్రాంతానికి అంబులెన్స్ సర్వీస్, ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ గిరిజన ప్రాంతంలో నివాసముంటున్న వారిలో సగానికి పైగా ప్రజలకు గుర్తింపు పత్రాలను అందజేశామని, మిగతా వారికి కూడా త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ తో, పలు సంస్థ కమ్యూనికేషన్ ప్రతినిధులతో చర్చించి మిగిలిన సమస్యలను త్వరలోనే అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్పోర్టు ఆఫీసర్ ఎ.అప్పలరాజు, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్ల సుజాతసత్యనారాయణ, జోన్ - 2 కమిషనర్ కె. కనకమహాలక్ష్మి, 6వ వార్డు వైసిపి అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, స్థానిక వైసిపి నేతలు పోతిన ఎలాజీ, పోతిన ప్రసాద్, గాదె రోసిరెడ్డి, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సియ్యద్రి కనకరాజు, ముందుండి రాజేశ్వరి, మొజ్జాడ రమణమూర్తి, పోతిన సూరిబాబు, కురిటి వెంకట లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లకు తూట్లు - దాసరి శ్రీనివాస్



మధురవాడ (విజయభాను న్యూస్) : వైసిపి ప్రభుత్వం లో పచ్చని చెట్లకు తూట్లు పొడుస్తున్నారని విశాఖ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి, 6వ టిడిపి అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆరోపించారు. విశాఖ పర్యటనకు సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడు వచ్చిన పచ్చని చెట్లు నరికి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, గతంలో చిన్నముషిడివాడిలోని శారదా పీఠం సందర్శించినప్పుడు అలాగే విశాఖ క్రికెట్ స్టేడియంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ప్రారంభించినప్పుడు కూడా అధికారులు ఇదేవిధంగా చెట్లు నరికి వేశారని ఇప్పుడు లా కాలేజీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వైసిపి పార్టీ కార్యాలయం ప్రాంతంలో ఉన్న చెట్లును నరికి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రీన్ సిటీగా, పర్యావరణానికి ప్రతీక పేరు గాంచిన విశాఖలో ఇలాంటి విధ్వంసాలు తగదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు విధ్వంసాలను ఆపి పర్యావరణం రక్షించాలని సోమవారం విడుదల చేసిన పత్రిక ప్రకటన ద్వారా కోరారు.

## రోడ్ల అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

### జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ





విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : రోడ్ల అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా లుంబిని పార్క్, హెచ్.బి.కాలనీ, సీతమ్మధార, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, ఆర్ అండ్ బి, ఎన్.ఎస్.టి.ఎల్. రోడ్డు, లక్ష్మీ నగర్, సింహాచలం, అడవివరం తదితర ప్రాంతాలలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా తారు రోడ్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లుంబిని పార్క్ బీచ్ లో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదని, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలని, ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించాలని, చాలాచోట్ల వినియోగంలో లేని వాహనాలు, బడ్డీలు, ఇతర వస్తువులు ఉన్నాయని వాటిని వెంటనే తొలగించి ఆ ప్రాంతాలను శుభ్రపరచాలన్నారు. చాలాచోట్ల రోడ్డుకి ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలు తొలగించాలని, 48 బస్ రూట్ రోడ్డును వెడల్పు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని గిరి ప్రదక్షిన రోడ్లలోని జంక్షన్ లను ఆధునికరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యలను నియోజవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కమిషనర్ దృష్టికి తీసుకురాగా ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ పర్యటనలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, డిడిహెచ్ దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజనీర్లు శ్యాంసన్ రాజు, సత్యనారాయణ రాజు, వేణుగోపాల్, రామ్మోహన్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, కృష్ణ, మల్లయ్య నాయుడు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, కంపా హనుక్, అల్లు శంకర్రావు, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు ఇతర జివిఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ (విజయభాను న్యూస్) : జోన్ - 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు వై.ఎస్.ఆర్ క్రికెట్ స్టేడియం సబ్ స్టేషన్ నందు గల 11కే.వి ధర్మపురి ఫీడర్ పై మరమ్మత్తులు మరియు చెట్లు తొలగింపు నిమిత్తం బుధవారం ఎంజీఆర్ లేఔట్, పీర్లెస్ కాలనీ, చాణక్యపురి లేఔట్, తారకరామ నగర్, ధర్మపురి కాలనీ, బింద్రా నగర్, పిలకవాని పాలెం, SFS స్కూల్ బ్యాక్ సైడ్, షిప్యార్డ్ లేఔట్, సుందర్ నగర్, సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించగలరని పీఎం పాలెం సబ్ స్టేషన్ ఏ.ఈ.ఈ మండల అప్పల నాయుడు ఒక ప్రకటనలో కోరారు.

## ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు



మధురవాడ (విజయభాను న్యూస్) : జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు పీఎం పాలెం లో భీమిలి నియోజకవర్గం ఇంచార్జి కోరాడ రాజబాబు గారు ఆదేశాల మేరకు వార్డులో యూనిట్ నెంబర్ 56 యూనిట్ ఇంచార్జి గరే గురునాథ్, యూనిట్ నెంబర్ 54 యూనిట్ ఇంచార్జి రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గరే గురునాథ్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఉన్న ఓట్లు లేనట్టుగా లేను ఓట్లు ఉన్నట్టుగా సృష్టించడం జరిగిందని, కనుక హౌస్ మ్యాపింగ్ వెరిఫికేషన్ ప్రతి బూత్ ఇంచార్జి తప్పనిసరిగా చేయడం జరుగుతుంది తెలిపారు. రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 2024లో చంద్రబాబును సీఎంగా చేయడమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కదలాలన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం తెలుగుదేశం పార్టీదే అంటూ ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో 268 బూత్ ఇంచార్జి పొతిన రమణ, 258 బూత్ ఇంచార్జి సుంకరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే రోజు పట్టాలెక్కనున్న 5 వందే భారత్ రైళ్లు..

ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఐదు వందే భారత్ రైళ్లను మంగళవారం ఉదయం 10.30గంటలకు ప్రారంభించనున్నట్టు పీఎంవో ఓ ప్రకటనలో వెల్లడించింది. మొత్తం ఐదు కొత్త వందేభారత్ రైళ్ల లో రెండు రైళ్లు మధ్యప్రదేశ్ నుంచి ప్రారంభం కానుండగా.. కర్ణాటక, బిహార్, గోవాల నుంచి మరో మూడు రైళ్లు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా రూట్‌లలో సర్వీసులందిస్తుండగా.. వీటితో కలిపి వందే భారత్ రైళ్ల సంఖ్య 24కి చేరుకోనుంది. మధ్యప్రదేశ్‌లో భోపాల్ నుంచి దిల్లీకి ఇప్పటికే ఒక వందే భారత్ రైలు సేవలందిస్తుండగా.. మంగళవారం కొత్తగా రాణి కమలాపతి-జబల్పూర్‌బీ ఖజురహో-భోపాల్-ఇండోర్ మధ్య రెండు రైళ్లు ప్రారంభం కానున్నాయి. రాణికమలాపతి-జబల్పూర్ వందే భారత్ రైలు మహాకౌసల్ ప్రాంతం (జబల్పూర్) నుంచి సెంట్రల్ రీజియన్ (భోపాల్)ను కలుపుతూ ప్రయాణికులకు సేవలందించనుంది. బెహ్రాఘాట్, పచ్‌మడి, సాత్పూర తదితర పర్యాటక ప్రాంతాల మీదుగా కనెక్టివిటీ ఏర్పాటు చేశారు. గతంలో ఈ రూట్‌లో సర్వీసులందిస్తున్న రైలుతో పోలిస్తే ఈ రైలు 30నిమిషాలు ముందుగానే గమ్యస్థానాలకు చేరుకోనుంది. ఖజురహో-భోపాల్-ఇండోర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మాల్వా (ఇండోర్), బుందేల్ ఖండ్ (ఖజురహో) నుంచి సెంట్రల్ (భోపాల్‌ను) కలుపుతూ సర్వీసులు కొనసాగించనుంది. ఈ రైలు ద్వారా మహాకాళేశ్వర్, మండు, మహేశ్వర్, ఖజురహో, పన్నా తదితర పర్యాక ప్రాంతాలకు వెళ్లే భక్తులకు సౌలభ్యం ఉంటుంది. ఈ మార్గంలో గతంలో సర్వీసులందిస్తున్న రైళ్లతో పోలిస్తే రెండున్నర గంటల ముందుగానే గమ్యస్థానాలకు చేరుస్తుంది. మడ్‌గావ్- ముంబయి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు గోవా రాష్ట్రానికి సంబంధించిన తొలి సెమీ హైస్పీడ్ రైలు. ఇది ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ నుంచి గోవాలోని మడ్‌గావ్ స్టేషన్ల మధ్య రాకపోకలు కొనసాగిస్తుంది. గతంలో వేగంగా ప్రయాణించే రైళ్లతో పోలిస్తే ఈ రైలు ద్వారా గంట సమయం ఆదా కానుంది. ధార్వాడ్-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కర్ణాటకలోని ధార్వాడ్, హుబ్బళ్లి, దేవనగరి పట్టణాలను బెంగళూరుకు కలుపుతూ సర్వీసులందిస్తుంది. కర్ణాటకకు సంబంధించి ఇది రెండో వందేభారత్ రైలు కావడం విశేషం ఇప్పటికే చెన్నై-బెంగళూరు-మైసూరు మధ్య వందేభారత్ రైలు సర్వీసులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. కొత్తగా ప్రారంభమయ్యే ఈ రైలుతో పర్యాటకులు, విద్యార్థులు, వ్యాపారులకు లబ్ధిచేకూరనుంది. ఈ రూట్‌లో ప్రయాణించే వేగవంతమైన రైళ్లతో పోలిస్తే దాదాపు అరగంట సమయం ఆదాకానుంది.

# వైఎస్సార్ లా నేస్తం పథకం విడుదల

నిలదొక్కుకుంటారన్నారు. మంచి ఆలోచనతో ఈ పథకం ప్రారంభించామని.. ఇప్పటి వరకూ 5,781 మందికి మేలు జరిగిందన్నారు. మొత్తంగా 41.52కోట్లు జూనియర్ లాయర్లకు ఇచ్చామని.. ఇలాంటి పథకం, ఇలాంటి ఆలోచన దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. కేవలం ఏపీలో మాత్రమే జరుగుతుందని.. అడ్వకేట్లకు అన్నిరకాలుగా మంచి జరగాలనే ఉద్దేశంతో రూ.100 కోట్లతో ఇప్పటికే వెల్ఫేర్ ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. మెడిక్లెయిమ్, ఇతరత్రా అవసరాలకు రుణాలను ఈ ఫండ్ నుంచి రూ.25 కోట్లు సహాయం చేశామన్నారు. న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం తోడుగా నిలిచిందన్నారు. జూనియర్లుగా ఉన్న న్యాయవాదులు ప్రతి ఒక్కరూ కూడా దీనివల్ల మంచి జరిగితే.. వీరు స్థిరపడ్డాక ఇదే మమకారం వీళ్లు పేదలపట్ల చూపిస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. తాను ప్రభుత్వం తరపు నుంచి న్యాయవాదుల నుంచి ఆశిస్తున్నది ఇదొక్కటే అన్నారు. ఈ విషయాన్ని ఎప్పుడూ మరిచిపోవద్దన్నారు.

**ఉద్యోగుల మొహాల్లో చిరునవ్వు కనిపించాలి: జగన్**

అంతేకాదు లాయర్ల కోసం అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీ సభ్యులుగా రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆర్థిక సాయం కోరే న్యాయవాదులు ఆన్‌లైన్‌లో sec_law@ap. gov.inనేరుగా లా సెక్రటరీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వైఎస్సార్ లా నేస్తం పథకానికి సంబంధించి 1902 నంబర్‌ను అందు బాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

## ఏపీపై అల్పపీడన ప్రభావం..

శాఖ అంచనా వేస్తోంది. ఈ రుతుపవనాల ప్రభావంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఆదివారం ఉరుములు, ఈదరుగాలులతో వర్షాలు కురిశాయి. అల్పపీడనానికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనం ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వరకు విస్తరించింది. ఈ ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండదు కానీ.. ఓ మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణశాఖ అంటోంది. ఉత్తరాంధ్రలో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉందని.. నైరుతి రుతుపవనాలు బలంగా ఉండడంతో ఈ నెల 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో సముద్రం అలజడిగా ఉంటుందని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. నేడు మన్యం, అల్లూరి, కాకినాడ,కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తూర్పుగోదావరి, శ్రీకాకుళం, గుంటూరు, నంద్యాల, పార్వతీపురం మన్యం, అనంతపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. తూర్పు గోదావరి జిల్లా పైడిమెట్టలో 5.9 సెంటీ మీటర్లు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస 4.1, గుంటూరు జిల్లా రావెలలో 4, పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలసలో 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అనంతపురంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ వర్షానికే నగరంలోని రోడ్లు జలమయం అయ్యాయి. అంతేకాదు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది. ఓ మోస్తరు నుంచి చిరుజల్లులు కురిశాయి. మరోవైపు నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో.. సకాలంలో వర్షాలు కురవక 20 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉంది.

నాలుగు జిల్లాల్లో సాధారణం, రెండు జిల్లాల్లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది అంటున్నారు. రాష్ట్రంలో అత్యల్పంగా నెల్లూరు జిల్లాలో సాధారణం కంటే 68.1 శాతం లోటు వర్షపాతం.. అత్యధికంగా బాపట్ల జిల్లాలో సాధారణంకంటే 38.5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలో పల్నాడు, కృష్ణా, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాలు ఉన్నాయి. వారం క్రితం వరకు ఎండలు, వేడిగాలులతో ఇబ్బందిపడిన జనాలకు ఈ వర్షాలు ఉపశమనం కలిగించాయి. మొత్తానికి రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించడంతో పాటూ ఇప్పుడు అల్పపీడనం ఏర్పడటంతో వర్షాలు ఊపందుకున్నాయి.

## ఇది రాష్ట్రమా.. రావణ కాష్టమా..

వైఎస్ జగన్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దాదాపు నెల రోజుల పాటు సాగుతుందని వివరించారు.

ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. గత నాలుగేళ్లుగా వైసీపీ పరిపాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ఎత్తుచూపుతూ జనంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లనున్నారు. ప్రచార కార్యక్రమంలో వివిధ రంగాల వారీగా జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపుతూ, 40 సంవత్సరాలు రాష్ట్రాన్ని వెనక్కి ఎలా నెట్టారో చూపిస్తూ.. ప్రజల వద్దకు తీసుకెళ్లనున్నారు.

## కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్..

ప్రభుత్వం. హరిద్వార్, రుషికేష్‌ల నుంచి యాత్రికులు ముందుకు రావొద్దని కోరారు ముఖ్యమంత్రి పుష్కర్ ధామి.

**20 గంటలపైనే..**

హిందువుల ముఖ్య పుణ్యక్షేత్రాలలో కేదార్‌నాథ్ శివాలయం ఒకటి. హిమాలయాల్లో నిర్మించిన ఈ ఆలయం 12 జ్యోతిర్లింగాలలో ఒకటి. దీన్నిఆదిశంకరాచార్యులు నిర్మించారు. హరిద్వార్ లేదా రిషికేశ్ నుంచి పూర్తి కొండచరియల మార్గంలో కనీసం 20 గంటల పాటు ప్రయాణం చేస్తేనే బేస్ పాయింట్ గౌరీకుండ్ చేరుకుంటాం. అయితే ఏకబిగిన 20 గంటలు ప్రయాణం అనేది ఏ మాత్రం సాధ్యం కాని పని.

**ప్రతికూల వాతావరణం..**

కేదార్‌నాథ్ మంచుకొండల మధ్య ఉంటుంది కాబట్టి ఉష్ణోగ్రతలు ఎప్పుడూ కనిష్టంగా ఉంటాయి. హఠాత్తుగా కూలిపడే కొండచరియలు, దెబ్బతినే రోడ్ల నడుమ అసలు ముందుకు సాగుతుందా లేదా అన్నట్టుగా ప్రయాణం ఉంటుంది. పైగా ఆ కొండలపై ట్రాఫిక్ తరచుగా నిలిచిపోతుంది. కేదార్‌నాథ్‌కు వాహనాలు వెళ్లవు. దాని బేస్ పాయింట్ గౌరీకుండ్ వరకే వాహనాలుంటాయి. అక్కడి నుంచి నడక మార్గం లేదా గుర్రాలపై మాత్రమే చేరుకోవచ్చు. హెలీకాప్టర్ ఉన్నా వాతావరణం అనుకూలిస్తేనే ప్రయాణం సాగుతుంది.

కేదార్‌నాథ్‌ను జీవితంలో ఒక్కసారైనా చూడాలని చాలా మంది తహతహలాడుతారు. ఈ సారి బోలెడు మంది ఇప్పటికే హరిద్వార్, రిషికేశ్ చేరుకున్నారు. తాజా వరదలతో నిరాశపడిపోయారు.

## గోదావరి జిల్లాల్లో ఒక్క సీటు కూడా వైసీపీకి రాకుండా చేస్తా

మనం మధ్యలో వెనకడుగు వేయకూడదన్నారు. ఏ పని మొదలుపెట్టినా మధ్యలో వదిలిపెట్ట కూడదని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 2008 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని.. మార్పు కోసం పంతం పట్టి కొనసాగుతున్నానని పవన్ కళ్యాణ్ అన్నారు. సమాజంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు చాలా అవసరమని.. ఈ మూడు కొద్ది మంది చేతుల్లోకి వెళ్లి, మిగతా వాళ్లు దేహీ అనే పరిస్థితిలో ఉండకూడదన్న ఉద్దేశంతో జనసేన పార్టీని స్థాపించానని తెలిపారు. ఎక్కడ చూసినా ఇసుక దోచేస్తున్నారని.. దీని వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని చెప్పారు.

ఉమ్మడి గోదావరి జిల్లాలో ఆక్వా కాలుష్యం వల్ల ఆరోగ్యం అనేది పెద్ద సమస్యగా మారిపోతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. గోదావరి జిల్లాలో కేరళ తరహా టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కానీ, పెట్టుబడి పెట్టేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి లాంటివాళ్లు వ్యాపారాలు చేస్తూ తమ స్వార్థం చూసుకుంటున్నారని విమర్శించారు. తాను పార్టీని నడుపుతూ దెబ్బలు తిన్నాను తప్ప, కార్యకర్తల ఆత్మగౌరవానికి ఎక్కడ భంగం వాటిల్లకుండా చూడగలిగానని చెప్పారు. డబ్బులు ఖర్చు చేయకుండా అభిమానులు కార్యకర్తల ప్రేమాభిమానాన్ని జనసేన పార్టీ సొంతం చేసుకోగలుగుతుందని వెల్లడించారు.

## గాజువాక మండల విద్యాశాఖ అధికారిణిగా ఎం.సునీత



గాజువాక (విజయభాను న్యూస్) : మండల నూతన విద్యా శాఖ అధికారిణిగా ఎం.సునీత సోమవారం నూతనంగా బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఆమె పరవాడ, పెద గంట్యాడ, పెందుర్తి, చినగదిలి మండలాల్లో విద్యాశాఖ అధికారిణిగా పనిచేశారు. ఈ మేరకు ఆమెను జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గాజువాకకు బదిలీ చేశారు.

ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరిం చిన ఆమె మాట్లాడుతూ, గాజువాకలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

### ఇంటింటికి వెళ్లి వారికి ఏం కావాలో అడగాలి



నర్సీపట్నం (విజయభాను న్యూస్) : వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఏ యే ధృవపత్రాలు కావాలో అడిగి తెలుసుకోవాలని మాకవరపాలెం ఎంపీడీవో అరుణశ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గిడుతూరు సచివాలయాన్ని భీమ బోయిన పాలెం సచివాలయాన్ని ఆమె సందర్శించారు. జగనన్న సురక్ష పథకాన్ని క్షేత్రస్థాయిలో ఏ విధంగా నిర్వహించాలనేది ఆమె స్వయంగా పరిశీలన చేశారు. ఇదొక గొప్ప సదవకాశామని దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో...

సర్పంచ్ నీలం గోవింద్, వైసీపీ నాయకులు మూకల బాలకృష్ణ, వీఆర్వో వెంకటరమణ కార్యదర్శి రాజారావు సచి వాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

### - గాజువాక ఎస్ఐ షేక్ నజీర్



గాజువాక (విజయభాను న్యూస్) : ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సదర్భంగా డిగ్రీ విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాజువాక ఎస్.ఐ షేక్ నజీర్ మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో పడి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే దుష్ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సచివాలయ మహిళా పోలీస్ శాంతి పాల్గొన్నారు.

## మడుతూరులో జగనన్న ఆణిముత్యాలకు సన్మానం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : ప్రభుత్వ పాఠశాలలో 10 ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మడుతూరులో సోమవారం ఘనంగా సన్మానించారు . మడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. మడుతూరు పాఠశాల స్థాయిలో మొదటి, రెండు, మూడు స్థానాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శనివాడ జవ్వాలనాయుడు, సర్పంచ్ మోటూరు సంజీవ్, సచివాలయ కన్వీనర్ తోట వెంకటేష్, వైసీపీ నాయకులు బలిరెడ్డి శ్రీను, మల్లపురెడ్డి శ్రీను, మోటూరు రమణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

## నేడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం




గాజువాక (విజయభాను న్యూస్): కణితి వడ్లపూడి ఆర్.హెచ్.కాలనీలో కోటి 75 లక్షల రూపాయలతో నిర్మించిన డాక్టర్ వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈనెల 27న ప్రారంభిస్తున్నట్లు 87వ వార్డు వైసిపి ఇన్చార్జి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర వైద్యం ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## రాజాం లో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం




రాజాం (విజయభాను న్యూస్) : అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజాం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ బి. శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. శ్రీచైతన్య జూనియర్ కాలేజి విద్యార్థులు, రాజాం రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులుతో కలసి డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో గాయత్రి కాలేజి ప్రిన్సిపాల్స్ డి. లక్ష్మీనాయుడు, రాజాం టౌన్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత,రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్గా, ఏఓ వి. సురేష్, ఎంఈఓ పి.నాగయ్, ఎస్ఈబీ ఇనెస్పెక్టర్ ఎస్.పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సారథిలో గడపగడపకు మన ప్రభుత్వం



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో సారథి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాజాం ఎమ్ఎల్ఏ కంబాల జోగులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలుపై ఆరాతీశారు. లబ్దిదారులకు బుక్ లెట్ లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, దూబ గోపాలం, మోహన్, కిలారి శ్రీనువాసరావు, మున్సిపల్ కమిషినర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మకోట పంచాయతీలో సమస్యలపై ఎంపిడిఓ దృష్టికి తీసుకువెళ్ళిన

### మార్కెట్ యార్డు డైరెక్టర్ కొర్ర సూర్యనారాయణ



అనంతగిరి (విజయభాను న్యూస్): గుమ్మ కోట పంచాయతీలో నెలకొన్న సమస్య లను పరిష్కరించాలని కోరుతూ.. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ కుమార్ ను కలిసిసమస్యలను పరిష్కరించాలని కోరిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొర్రా సూర్య నారాయణ అనంతరం కొర్రా సూర్య నారాయణ మాట్లాడుతూ.. పంచాయతీ. కార్యదర్శి లేకపోవటంతో పంచాయితీలో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, పంచాయతీకి పూర్తిస్థాయిలో కార్య దర్శిని నియమించాలని ఎంపిడిఓ ను కోరారు. వీటితో పాటుగా గొట్లపాడు, దుండవలలో , త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు.. ఈ కార్యక్రమంలో వాలాసి సర్పంచ్ సన్యాసి రావు, వైసీపీ సీనియర్ నాయకులు స్వామి, గంగులు, చిన్నారావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం చేయండి ప్రాణ దాతలు కండి



రాజాం (విజయభాను న్యూస్) : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రాజాం అమృత హాస్పిటల్ ఎండీ గార రవిప్రసాద్ రక్తదాతలకు పిలుపునిచ్చారు. యువత రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని కోరారు. ఆదివారం రాజాం కరూర్ వైశ్య బ్యాంక్ 107వ వార్షికోత్సవ పురస్కరించుకొని బ్యాంకు వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని రవిప్రసాద్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సాయి కిరణ్ మాట్లాడుతూ 107 సంవత్సరాలుగా ప్రజలకు బ్యాంకు చేరువై ఆర్థిక పరిపుష్టికి దోహద పడటం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. ఈ శిబిరంలో 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ.రవి కుమార్, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్, పాలవలస శ్రీనివాస రావు, అడ్వకేట్ అర్. జయదేవ్, నీలకంటేశ్వర యాదవ్, రెడ్ క్రాస్ సభ్యులు ప్రకాష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.13.5 లక్షలు వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### పూజ కార్యక్రమం చేసి ప్రారంభించిన 27వవార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : 27వ వార్డ్ శ్రీనగర్ ప్రాంతం, సిమెంట్ రోడ్డులో 13.5 లక్షలు వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి 27వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి పనులు ప్రారంభించి పూజ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వీరారావు బుజ్జి మాట్లాడుతూ ఇప్పటికే శ్రీనగర్ ప్రాంతంలో అన్ని బీటీ రోడ్లు వేయడం జరిగింది అని ఈ రోడ్డులో ఇదివరకు 6.5 లక్షలు ఖర్చుతో డ్రైనేజీలు నిర్మాణం జరిగాయని ఈ సీసీ రోడ్ నిర్మాణంతో శ్రీనగర్ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం పూర్తి అయినట్లేనని వార్డులో మిగతా ప్రాంతాల్లో కూడా పనులు జరుగు తున్నాయని సకాలంలో అన్ని పనులూ పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ. ఈ. శ్రీనివాసరావు, ఏమినిటీ కార్యదర్శులు చక్రి, ఉషారాణి 27వ వార్డ్ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మిశివప్రసాద్, పిల్లి నర్సింగ్ రెడ్డి, జలగంపల నాగ భూషణం స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ మండల పార్టీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ దాలయి పాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరవాడ మండల పార్టీ అధ్యక్షులు కోన రామరావు అధ్యక్షతన పంచాయితీ ల వారీగా నిర్వహించిన పరవాడ మండల పార్టీ సమావేశానికి ముఖ్య అతిధులు గా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొని పంచాయతీల వారిగా నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశిస్తూ దివంగత మాజీ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా 08-07-23 తేదీన మధ్యహ్నం 3 గంటలకు పెందుర్తి కూడలిలో సుమారు 20,000 మందితో నిర్వహించబోయే భారీ బహిరంగ సభ కు ముఖ్య అతిధులు గా టి.టి.డి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, పంచాయతీ రాజ్ శాఖ మాత్యులు బూడి ముత్యాల నాయుడు , రాష్ట్ర వాణిజ్య మరియు ఐ.టి శాఖ మాత్యులు గుడివాడ అమర్నాథ్ విచ్చేస్తున్నారు అని, అలాగే ప్రతి పంచాయతీ నుండి సుమారు 500 మంది వరకు జన సమీకరణ చేసి ఆ రోజు జరిగే బహిరంగసభ కు హాజరై విజయవంతం చెయ్యవలిసింది గా తెలియచేసారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు , పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు , జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు , పరవాడ మండల వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, మండల జె సి ఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, మాజీ ఆర్ ఇ సి ఎస్ చైర్మన్ చల్ల కనకరావు, గ్రేటర్ వార్డు ఇన్చార్జి అప్పి కొండ మహా లక్ష్మి నాయుడు పరవాడ మండలం లో గల సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## సంఘీభావం

'మొదట వారు కమ్యూనిస్టుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను కమ్యూనిస్టును కాదు/ తర్వాత వారు సోషలిస్టుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను సోషలిస్టును కాదు/ అప్పుడు వారు ట్రేడ్ యూనియన్ వాదుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను ట్రేడ్ యూనియన్ వాది కాదు/ అప్పుడు వారు యూదుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను యూదుని కాదు/ ఇప్పుడు వారు నా కోసం వచ్చారు/ నా కోసం మాట్లాడటానికి ఎవరూ లేరు' అంటాడు మార్టిన్ నీమొల్లర్. హిట్లర్‌కు గట్టి మద్దతుదారుగా వున్న నీమొల్లర్... వారి భ్రమల నుంచి బయట పడిన తర్వాత, వారికి వ్యతిరేకంగా తన స్వరాన్ని పెంచాడు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో అసహనం, అన్యాయాలకు గురైన బాధితుల పక్షాన నిలిచి, వారిని సంఘటితం చేసేందుకు, వారిలో ఐక్యత పెంచేందుకు, వారికి సంఘీభావం తెలిపేందుకు పై కవితను రాశాడు. విభిన్న సంస్కృతులు, భావజాలాలు, ఆసక్తులతో వర్గీకరిం చబడిన సమాజంలో, సంఘీభావం సానుకూల మార్పుకు శక్తివంతమైన ఉత్ప్రేరకంగా నిలుస్తుంది. 'సంఘీభావం అనేది స్వచ్ఛందమైన పనికాదు. ఒక లక్ష్యం కోసం పోరాడే శక్తుల మధ్య పరస్పర సహాయం' అంటారు ప్రముఖ సోషలిస్ట్, మొజాంబిక్ దేశ మొదటి అధ్యక్షుడు సమోరా మాచెల్. అసమానత, అన్యాయాలకు గురవుతున్న సమాజంలో వ్యవస్థాగత సమస్యలను ఎదుర్కోవడానికి సంఘీభావం ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుంది. అణచివేత వ్యవస్థలు, నిరంకుశత్వం, వివక్షాపూరిత విధానా లను సవాలు చేయడానికి వ్యక్తులను, సంఘాలను ఇది ఉత్తేజ పరుస్తుంది. అట్టడుగు వర్గాలకు సంఘీభావంగా నిలవడం ద్వారా సమానత్వం, న్యాయం కోరే ఐక్య వేదికలను సృష్టించవచ్చు. నిరంకుశ ధోరణులను ఎదుర్కోడానికి, అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడానికి, వారి పురోగతికి అవసరమైన మార్గాలను రూపొందించడానికి బాట ఏర్పడుతుంది. నాటి వాల్‌స్ట్రీట్ ఉద్యమం నుంచి నిన్నా మొన్నటి రైతు ఉద్యమం, రెజ్లర్ల ఉద్యమం వరకు నిరంకుశ విధానాలపై బిగించిన పిడికిళ్లు, గర్జించిన గళాలు ఉద్యమ కెరటాలయ్యాయి. ఒక్కరితో మొదలై... వేలాదిమందితో ఐక్యమై, సంఘటితమై సాధించిన విజయాలలో కీలకమైన విషయం. 'ఐక్యత బలమైన శక్తి : ఐక్యత లేని ప్రజలు శక్తిహీనులు' అంటాడు ఘనా దేశ మొదటి అధ్యక్షుడు, 1962లో లెనిన్ శాంతి బహుమతి గ్రహీత క్వామే న్క్రుమా. దశాబ్దాలుగా భూమితో, ఊరితో పెనవేసుకున్న అనుబంధం. నిద్ర లేచింది మొదలు... మళ్లీ నిద్రించే వరకు ఆ పల్లెతోనే వారి బతుకు, అడవిలోనే వారి జీవన ప్రయాణం. అలాంటి బతుకు బంధాన్ని రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిన పల్లె తల్లి బిడ్డలు వారు. తల్లి ఒడి నుంచి బలవంతంగా నెట్టబడిన నిర్వాసితులు. శ్రీశైలం, నాగార్జునసాగర్ మొదలు... వెలుగొండ, వంశధార వరకు నిర్వాసితుల కన్నీటిగాథలన్నీ ఒక్క రీతిగానే వున్నాయి. ఇప్పుడు పోలవరం నిర్వాసితులు కూడా ఆ జాబితాలో చేరారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు కట్టబెడుతున్న ప్రభుత్వాలు... నిర్వాసితులకు మొండిచెయ్యి చూపుతున్నాయి. కలలను, ఆశలను కలబోసి కట్టుకున్న సొంత ఇంటిని వదిలేలాచేసి... నిర్వాసితులుగా మార్చారు. కట్టెలు, తేనె, వెదురు, కూరగాయలు, పుట్టగొడుగులతో అమ్మలా ఆదుకుని బువ్వెట్టిన అడవితల్లికి దూరమై, సమీప పొలాల్లోకి వ్యవసాయ కూలీలుగా విసిరేయబడినోళ్లు కొందరైతే, పరిహారం కోసం ఎదురుచూస్తూ.. సొంతవూళ్లలోనే బిక్కుబిక్కుమంటున్నోళ్లు ఇంకొందరు. 'అట్టడుగున పడి కనిపించని/ కథలన్నీ కావాలిప్పుడు/ దాచేస్తే దాగని సత్యం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఎవరికీ పట్టని నిర్వాసితుల కన్నీటి కథలన్నీ వెలుగులోకి తేవాలని, న్యాయం కోసం ఎదురుచూస్తున్న పోలవరం నిర్వాసితులకు తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాలను నిలదీస్తున్నది పోరుకేక. రోడ్డున పడిన నిర్వాసితులకు సంఘీభావంగా మొదలైంది పోరుయాత్ర. ఎరుపెక్కిన నిర్వాసితుల కన్నీళ్లు ప్రశ్నిస్తున్నాయి మా వెనుక మీరుండరా? అని. సంఘటితమై... సమైక్యమై... నేను సైతం అంటూ అడుగు వేద్దాం. మొదటి అడుగు ఒంటరే కావొచ్చు... నీ వెనుక వచ్చేవారికది బాట అవుతుంది.

# కృష్ణదాస్ జన్మదిన వేడులకు సన్నాహాలు

- జూలై 7న అట్టహాసంగా నిర్వహించడానికి కార్యాచరణ
- సమావేశమైన నియోజకవర్గ ముఖ్య నేతలు




నరసన్నపేట(విజయభాను న్యూస్): మాజీ డిప్యూటీ సీఎం, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైసీపీ శ్రేణులు భారీగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం నరసన్నపేట వైసీపీ కార్యాలయంలో ఆయా మండలాల ఎంపీపీల ఆధ్వర్యంలో పార్టీ బాధ్యులు సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా జూలై 7న వస్తున్న ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలను గత మూడు సంవత్సరాలుగా కోవిడ్ కారణాల వల్ల నిర్వహించుకోలేక పోయామని వారన్నారు.

ప్రస్తుతం ఆ సమస్య దాదాపుగా తొలగిపోవడంతో ఈ ఏడాది భారీగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకుగాను తగిన కార్యాచరణని రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఎక్కడిక్కడ కేక్ కటింగ్ తో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అదే రోజు భారీగా వచ్చే కార్యకర్తలకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించనున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పార్కింగ్ సదుపాయాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేసే విషయంలో ఎవరికీ ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్ణయించారు.

మరుపురాని విధంగా పండుగ వాతావరణంలో ఆత్మీయంగా.. పుట్టినరోజు వేడుకలు గుర్తుండిపోయేలా చేయాలని సంకల్పించుకున్నారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వర రావు, ఎంపీపీలు ఆరంగి మురళీధర్, వాన గోపి, జడ్పిటిసి ప్రతినిధి చింతు రామారావు, ఎంపీపీ ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, కోరాడ చంద్ర భూషణ్ గుప్త, సురంగి నరసింగరావు, సదాశివుని కృష్ణ, బొబ్బది ఈశ్వరరావు, తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అనకాపల్లి నూకాంబికా అమ్మవారు!

పల్లవి:
కాకతాంబగా అనకాపల్లి నందు వెలసినావు
నూకాంబికగా మారి మా ఇలవేలుపువైతివి
మహిమలు గల దేవతగా పేరు గాంచితివమ్మ
భక్తులను కాపాడే కల్పవల్లి నీవమ్మ

చరణం: 1
మహిమలను జూపి దుర్గమ్మరూపమైనావు
ఏటేటా కొత్త అమావాస్య పండుగ జేసి
నెలరోజుల ఆనందపు జాతర మీదేనమ్మ
అంబరమ్మునంటు సంబరముల అర్చించెదము

చరణం: 2
పసుపుకుంకుమలతో నిత్యం పూజి0చెదము
అష్టదళపద్మాలతో ఆరాధన నీకమ్మ
ధూపదీప హెూమాలతో నిరతం నిను కొలిచెదము
ఫల పుష్పాదుల నిచ్చి మిము సేవించెదము

చరణం: 3
మీ మాలా ధారణతో దీక్షబూనుతామమ్మ
ఉత్తరాంధ్ర కనకదుర్గతల్లి నీవు కరుణింపుమా
నిత్య పూజలందుకునే దేవతామూర్తివి
మీ చల్లని దీవెనలతో మము కాపాడోయమ్మ



రచన : పల్లి నల్లనయ్య

# ఎర్ర మట్టి దిబ్బలపై వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం

- పరిరక్షించాల్సిన విఎమ్ఆర్డిఏ - పడగొట్టే బుల్డోజర్ గా తయారైన వైనం
- ప్రకృతిని పరిరక్షించుకోవాలి
- అందుకోసం విశాఖలో ప్రతి పౌరుడు అడుగువేయాలి
- పర్యావరణ ఆంధ్ర ప్రదేశ్ జనసేన నినాదం
- చారిత్రాత్మక వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బల్లో భూసమీకరణ ను నిలిపివేయాలి
- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్





విశాఖపట్నం(విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్లోనే కాక దేశవ్యాప్తంగా పేరొందిన ఎర్రమట్టి దిబ్బల ఉనికిని, ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా విశాఖపట్నం పట్టణ అభివృద్ధి సంస్థ ( వీ ఎం ఆర్ డీ ఏ ) ద్వారా భూ సమీకరణ నోటిఫికేషన్ జారీ చేయడం చట్ట విరుద్ధం. దేశ విదేశీ పర్యాటకులను, సినీ నిర్మాతలను ఆకర్షిస్తున్న వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఎర్రమట్టి దిబ్బలలో లే అవుట్ లు వేయడం వల్ల పర్యావరణ సమతౌల్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒకప్పుడు 1500 ఎకరాల్లో విస్తరించి ఈ దిబ్బలు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం అసమర్థ విధానాల కారణంగా 80 ఎకరాలకే పరిమితమయ్యాయి. వాటిని కాపాడి పర్యాటకపరంగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ధ్వంసం చేసే ప్రయత్నం చేయటం బాధాకరం. భోగాపురం విమానాశ్రయానికి ఎర్రమట్టి దిబ్బల పక్కనుంచి వెళ్లే రహదారిని ఎర్రమట్టి దిబ్బల ప్రాధాన్యత దృష్ట్యా కుదించిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఇప్పుడు ఏకంగా లేఅవుట్ వేసేందుకు ముందుకు రావడం పలు అనుమానాలకు కారణం అవుతుంది. వారసత్వ స్థలాలను పరిరక్షించి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వాటిని ధ్వంసం చేయటం క్షమించరాని నేరం. జే. వీ.అగ్రహారం, నేరళ్ళ వలస, నిడిగట్టు, చిప్పాడ, తాళ్ళవలస, దాకమర్రి తదితర గ్రామాల్లో భూ సమీకరణకు ఇచ్చిన నోటిఫికేషన్ ను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నాం. ఇది చట్ట విరుద్ధం. వాల్టా చట్టానికి కేంద్ర చట్టాలకు ఈ భూ సమీకరణ పూర్తిగా విరుద్ధంగా ఉంది., ఐఎన్ఎస్ కళింగ దేశభద్రతాపరంగా అత్యంత కీలకమైన ప్రాంతం. దాని పక్కనే లే అవుట్ వేయటం దేశభద్రతకు ప్రమాదమే అవుతుంది.

పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా గతంలో చేపట్టిన భూ సమీకరణ లన్ని అక్రమాలు, అవినీతికి చిరునామాగా మారాయి. 15 ఏళ్ల క్రితం వేసిన పరదేశీ పాలెం ఓజోన్ వ్యాలీ అతీగతీ లేకుండా పడి ఉంది. ఇందులో వందల కోట్ల రూపాయలు అవినీతి అక్రమాలు జరిగాయని గతంలో వుడా వీసీగా పనిచేసిన కోన శశిధర్ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. దానిపై ఇప్పటికి చర్యలు లేవు. ఓజోన్ వ్యాలీని అభివృద్ధి చేయలేదు. కొందరు వ్యక్తుల స్వార్థం కోసం ముదపాకలో ప్రారంభించిన భూ సమీకరణ పలు వివాదాలతో హైకోర్టు విచారణలో ఉంది. ఈ భూ సమీకరణ కారణంగా కిందిస్థాయి సర్వే అధికారులు రెవెన్యూ అధికారులు క్రమశిక్షణ చర్యలకు గురయ్యారు. విశాఖపట్నం పట్టణ అభివృద్ధి సంస్థకు భూ సమీకరణ కలిసి రాలేదు.

అధికారంలో ఉన్న కొందరు పెద్దలు, పైరవికార్ల స్వార్థం కోసం వుడా ద్వారా భూ సమీకరణ జరిపిస్తున్నట్టు మొదటి నుంచి ఆరోపణలు ఉన్నాయి. వాస్తవాలను పరిశీలించి ఎర్రమట్టి దిబ్బల పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భూ సమీకరణను తక్షణమే నిలిపివేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతం మొత్తాన్ని వారసత్వ సంపద గా గుర్తించి భవిష్యత్తులో అక్కడ ఎటువంటి విధ్వంసాలు జరగకుండా కట్టుదట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఇప్పటికే ఋషికొండ, ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి ప్రాంతాల్లో వేలాది చెట్లు నరికేసి ప్రకృతి విద్వాంసానికి పాల్పడిన ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఈ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సంబంధిత అధికారులు ఇప్పటికే హైకోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఎర్రమట్టిదిబ్బల జోలికి వెళ్లి మరో మారు అటువంటి తప్పు చేయవద్దని కోరుతున్నాం.

## యుపిఎస్సి నిర్వహించు పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

విద్యార్థులు చేరుకొనేలా సరిపోయే ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను,విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఎపిఈపిడిసిఎల్ అధికారులను, మంచి నీరు సరఫరా చేయాలని జివియంసి అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ కళాశాలల ప్రిసిపల్స్ విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ,పోలీస్ , రెవిన్యూ , పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా జగన్నాథుడి రథయాత్ర

మహబూబ్‌నగర్ : జగన్నాథుడి నామస్మరణతో పాలమూరు పుర వీధులు మార్మోగాయి. భక్తుల జయజయధ్వానాల మధ్య కళాకారుల నృత్యాలతో సాగిన దేవతామూర్తుల ఊరేగింపు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటింది. ఇస్కాన్ సంస్థ (కూకట్‌పల్లి, హైదరాబాదు) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. పద్మావతికాలనీలోని కృష్ణమందిర ముఖద్వారం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. ఉమ్మడి పాలమూరు జిల్లా భక్తులే కాకుండా విదేశాల నుంచి ఇస్కాన్ సంస్థకు చెందిన కృష్ణభక్తులు, వివిధ ఆధ్యాత్మిక, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. హరేరామ.. హరేరామ, రామరామ హరే హరే., హరేకృష్ణ.. హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే.. అంటూ భక్తులు లయబద్ధంగా నృత్యాలు చేయడం ఆకట్టుకుంది.

# రోడ్డు పనులు పరిశీలించిన మంత్రి ధర్మాన

శ్రీకాకుళం, : స్థానిక డే అండ్ నైట్ కూడలి నుంచి ఆమదాలవలస రైల్వే స్టేషన్ వరకూ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. "ఈ రోడ్డుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రైల్వే స్టేషన్ కు రాకపోకలు సాగించేవారికి అలానే వీరఘట్టం వైపు నుంచి రాయగఢ వెళ్లేవారికి, అలానే బత్తిలి నుంచి ఒడిశా వైపునకు వెళ్లే వారికి కూడా ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ రోడ్డు పనులు ఆర్ అండ్ బీ శాఖ నిర్వహిస్తోంది. ఈ రోడ్డుకు నలభై కోట్ల రూపాయలు మంజూరు చేశాం. త్వరగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. రోడ్డును విస్తరించి వేస్తున్నాం. కొన్ని సమస్యలు ఉన్నాయి. జిరాయితీ ల్యాండ్ ఉంది. అలానే కొన్ని కట్టడాలు తొలగించాల్సి ఉంది. ఇవన్నీ చేసి రోడ్డు వెడల్పు చేస్తున్నాం. బలగ ప్రాంతం నుంచి రద్దీ ఎక్కువగా ఉంది. అక్కడ కట్టడాలు తొలగించాల్సి ఉంది. అలానే కొన్ని వాణిజ్య కూడళ్లు కలుపుకుని డే అండ్ నైట్ జంక్షన్ వరకూ పనులు చేస్తున్నాం. డిస్ట్రిక్ట్ జడ్జి నివాసానికి సంబంధించి గోడ కూడా తొలగించాల్సి ఉంది. అలానే ఆర్టీసీ కాంప్లెక్స్ కు సంబంధించిన గోడ కూడా కూల్చాల్సి ఉంది. వీటి స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి దీనికి మున్సిపల్ నిధులు కేటాయించాం. ఇందుకు కోటీ పది లక్షల రూపాయలు నిధులు విడుదల చేశాం. టెండర్లు కూడా పిలిచాం. అలానే కొన్ని చోట్ల జనావాసాలు ఉన్న చోట్ల అభ్యర్థన మేరకు డబ్భై అడుగుల మేరకు రోడ్డు ఉంటుంది.

# అనంతగిరిలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

## రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రి విడుదల రజినిని కోరిన ఎంపీపీ శెట్టి నీలవేణి




అనంతగిరి, విజయభాను. న్యూస్ : అనంతగిరి మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఎంపీపీల సంఘం ఎస్టీ విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణిలి రాష్ట్ర వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వ్రిడదల రజినిని కోరారు. పాడేరు పర్యటనకు విచ్చేసిన మంత్రిని కలసి మండలంలో నెలకొన్న పలు సమస్య లను ఆమె దృష్టికి తీసుకుని వెళ్లారు. ప్రమాదాలు జరిగే సమయంలో అనంతగిరి వాసులకు శృంగవరపుకోటలో అత్యవసర వైద్యంతో పాటు చనిపోయిన సమయాల్లో పోస్ట్ మార్టం చేయడంలో పలు సమస్యలు తలెత్తుతున్నాయని అందువల్ల అనంతగిరి మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్యంతో పాటు శవ పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమెను లిఖిత పూర్వకంగా కోరారు. అదేవిధంగా భౌగోళికంగా అనంతగిరి మండలంలో సుదూర ప్రాంతాల అధికంగా ఉన్న నేపథ్యంలో రెండవ 108 ను కాశీ పట్నం కేంద్రంగా మంజూరు చేయాలని ఆమెకు విన్నవించారు. వసతి గృహాల్లో హెల్త్ వర్కర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమెను కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరము పాడేరులో వైద్య కళాశాల నిర్మాణపు పనులను అదేవిధంగా మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ తదితర కార్యక్రమాలలో మంత్రి రజిని పాల్గొనగా ఆమెతోపాటు అరకులోయ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి లిగోడ్డేటి మాధవిలి అరకులోయ పాడేరు శాసనసభ్యులు లిచెట్టి పాల్గుణ లికోటగుల్లి భాగ్యలక్ష్మి జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్రలి, జిసిసి చైర్పర్సన్ శోభ స్వాతిరాణి, ట్రైకర్ చైర్మన్ శతక బుల్లిబాబు ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లికృష్ణారావు జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, ఐటీడీఏ పీ ఓ, అభిషేక్, ఎంపీపీలు అనూష దేవి, బోయిన కుమారి, రమేష్ జెడ్పిటిసిలు నాగరత్నం రోషిణి,బొంజు బాబు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత భవనాలతో పాటుగా లయన్స్ సేవా ఆధ్వర్యంలో కార్యక్రమాలు

## - సమాజానికి హిత కార్యక్రమాలు చేయాలి - లయన్స్ పూర్వ గవర్నర్ బాలకృష్ణ



కాకినాడ (విజయభాను న్యూస్) : శాశ్వత భవనాల నిర్మాణం తో పాటు పలు సేవా కార్యక్రమాలను వేగవంతం చేయాలని లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పిలుపునిచ్చారు. కాకినాడ లయన్స్ క్లబ్ హాల్ నందు లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ బాదం బాలకృష్ణ ఎనిమిది లయన్స్ క్లబ్ల నూతన కార్యవర్గాలచే ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్లు నిర్మించే శాశ్వత కట్టడాలతో పాటు యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ, మహిళలకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాళ్ళ కాలపై వారు నిలబడే విధంగా తయారు చేయాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధం, నీటి పొదుపు, ఆహారం వృధా కాకుండా చూడటం వంటి కార్యక్రమాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. కాకినాడ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా వి రామసుబ్రహ్మణ్యం, పుష్కర్ క్లబ్కు పివిఆర్ గాంధీ, గోల్డెన్ జూబీ క్లబ్కు ఎన్ సుధాకర్ గుప్త, సఖి క్లబ్కు రత్నమాల, మనం క్లబ్కి కె సుజాత, స్టార్స్ క్లబ్కు జి ఓం నమశ్శివాయ, లయనెస్ క్లబ్కు సరితలతో వారి కార్యవర్గాలు నూతన సభ్యులచే ప్రమాణం చేయించారు.

ముఖ్యఅతిథి పూర్వపు జిల్లా గవర్నర్ ఎం విశ్వేశ్వరరావు ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో మొదటి ఉప గవర్నర్ ఈశ్వర్ కుమార్, రీజియన్ చైర్మన్లు మేడిశెట్టి వెంకటరమణ, వడ్డాది జ్యోతి, నూలు నాగలక్ష్మి, దేవత పుత్రరావు, నేరెళ్ల మురళి, దంగేటి సతీష్, పి సతీష్, ఎంవిఆర్ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 35వ వార్డు అభివృద్ధికి సంబంధించి జీవీఎంసి కమిషనర్‌కి

## వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వినతి పత్రం



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్): జివియంసి స్పందన కార్యక్రమం లో భాగంగా 35వ వార్డు పరిధిలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు అలాగే 35వ వార్డు అభివృద్ధికి సంబంధించి జీవీఎంసి కమిసనర్‌కి వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ వినతి పత్రంలో ఆయిల్ మిల్లు రోడ్డుమరియు కాలువలు పున నిర్మాణం చేపట్టాలని గాజులు వీధిలో అంగన్వాడీ కేంద్రం నూతనంగా ఏర్పాటు చేయాలని గాజులు వీధీ ని స్ట్రాప్ వ్యాపారుల అక్రమణ నుంచీ కాపాడాలని అలాగే పూర్ణ మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు రోడ్డు కు ఇరువైపులా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని, అలాగే పూర్ణ మార్కెట్ అరటి పళ్ళు సందు రోడ్డు అసంపూర్తిగా సిసి రోడ్ వేయడం జరిగింది ఆ మిగిలిన రోడ్డును కూడా పునర్నిర్మాణం చేపట్టాలని పూర్తిగా సిసి రోడ్డు వేయాలని వేలంపేట స్టేడియం తూర్పు గేటు ఆపోజిట్లో సిసి రోడ్ వేయాలని ప్రసాద్ గార్డెన్స్ పండ వీధి చిన్న దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో ఖాళీగా ఉన్న ప్లేస్ లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని వేలంపేట లక్ష్మీనగర్ మురికివాడ ప్రాంతాన్ని పక్క గృహాలు నిర్మించాలని... అలాగే విపిటి పోర్టు మెయిన్ గేటు ఎదురుగా సీ హార్స్ విగ్రహాలు ఏర్పాటు చెయ్యాలని ఇలా 35 వ వార్డ్ సమస్యలపై అభివృద్ధి పై వినతిపత్రం సమర్పించడం జరిగింది.

# భీమిలి కేజీబీవిని సందర్శించిన స్టేట్ ప్రోజెక్ట్ అధికారి

భీమునిపట్నం , విజయభాను న్యూస్ : స్థానిక గొల్లలపాలెంలో ఉన్న కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం స్టేట్ ప్రోజెక్ట్ అధికారి బి. శ్రీనివాసరావు జిల్లా అధికారులతో కలసి సందర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న జెవికె కిట్స్ ను పరిశీలించారు. మిర్రర్ ఏక్టివిటీ, లిప్ లీడ్, లైబ్రరీ, లేబ్ పరిశీలించారు. అనంతరం వంటగదిని చూసి మెనూ ఎలా అమలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలలో అమలవుతున్న విషయాలపై చర్చించారు. తల్లిదండ్రులు మంచిగా స్పందించి పాఠశాలలో మా పిల్లలు చాలా బాగా చదువుకుంటున్నారని అన్నారు. పాఠశాల సిబ్బందితో మాట్లాడి పాఠశాలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. మంచినీటి సమస్య ఉందని చెప్పడంతో త్వరలో పరిష్కరిస్తానని అన్నారు. పాఠశాల నిర్వహణ, సిబ్బంది అనుసరిస్తున్న విధానంపై పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో ఆర్ జె డి జ్యోతికుమారి,జిల్లా విద్యాశాఖాది కారిణి చంద్రకళ, జిసిడిఓ ఖలీశా బేగం, మండల విద్యా శాఖాది కారులు బాలామని, జయప్రద, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# హిజ్రాల జీవిత సంఘర్షణే అర్ధనారి



శాంతారావును సత్కరిస్తున్న దృశ్యం

రాజాం (విజయభాను న్యూస్) : నేటి సమాజంలో ఆడమగ కాని హిజ్రాల (కొజ్జాల) జీవిత సంఘ ర్షణనే బండి నారాయణ స్వామి అర్ధనారి నవలగా తీర్చి దిద్దారని ప్రముఖ సాహితీవేత్త రాజాపు శాంతారావు పలికారు. ఈ నవలలో హిజ్రాల సంఘర్షణ పాటు వేశ్యల బాధాకరమైన జీవితాలను కూడా వాస్తవ రూపంలో వర్ణించారని ఆయన చెప్పారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 101 వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాంతారావు ముఖ్యవక్తగా 'అర్ధనారి నవలలో సామాజిక పరిశీలన' అనే అంశంపై మాట్లాడారు. పురుషులు స్త్రీలుగా మారే క్రమంలో హిజ్రాగా స్థిరపడడం, సంఘం వారిపై చూపించే చిన్నచూపు, హిజ్రాలను, వేశ్యలను పోలీసులు పెట్టే హింసను చక్కగా చిత్రించారని చెప్పారు. ధనిక హిజ్రాలు, పేద హిజ్రాల మధ్య సమాజం చూపే భిన్నమైన చూపును, పేదింటి తల్లిదండ్రులే తమ పిల్లలు హిజ్రాలుగా మారితే చూసే హీనమైన దృష్టిని ఆయన వివరించారు. ఇకనైనా సమాజం హిజ్రాల పట్ల ఆదరణ భావంతో, సమభావంతో ప్రవర్తించాలని శాంతారావు కోరారు. ఈ సందర్భంగా శాంతారావును వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఆల్తి మోహన్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు గణపతిరావు నాయుడు, నేతేటి గణేశ్వరరావు, పెంకి దయానిధి నాయుడు, శాసపుసత్యనారాయణ, పిల్లా తిరుపతి రావు, శాశపు జయలక్ష్మి, పొట్నూరు కోటిబాబు,కుదమ తిరుమల రావు, దన్నాన రామారావు, సమతం మహేశ్వరరావు, మూడడ్ల శ్రీనివాస రావు, పడాల కవీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# "మత్తు" మహమ్మారిని పారద్రోలండి

## - అవగాహన కార్యక్రమంలో డిఎస్పి సత్యనారాయణ




పరవాడ (విజయభాను న్యూస్) : యువతను మత్తులో ముంచేత్తుతూ వారీ భవితకు పరిణమిస్తున్న మాదకద్రవ్యాల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ డిఎస్ పి పి.సత్య నారాయణ పేర్కొన్నారు.. సోమవారము మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్క రించుకొని పరవాడ సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు అద్వ ర్యంలో పరవాడ పోలీసుస్టేషన్ కు ఎదురుగా ఉన్న జెఎన్ అర్ ఏమ్ కాలనీ పరిసరప్రాంతాల్లో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతోర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు..ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరవాడ డిఎస్ పి పి,సత్య నారాయణ హజరైన్నారు..ఈ సందర్భంగా అయన మాట్లడుతూ తల్లిదండ్రులు వారిపిల్లలు ప్రవర్తనలో మార్పును ఉండాలానీ, ప్రత్యేక దృష్టి పెట్టడంద్వారా వారి గమనాన్ని మనం నిర్దేశించగలమన్నారు.. డ్రగ్ వ్యాపారులు యువతను టార్గెట్ చేసుకుని తమ వ్యాపారం విస్తృతం చేసుకునే విధానాన్ని వివరించారు..యువశక్తిని నిర్వీర్యం చేస్తూకొట్లాది జీవితాల్ని క్రూరంగా బలిగొంటున్న మాదకఉగ్రవాదాన్ని ఉపేక్షించడం జాతిభవితకే తీరనిచేటు అన్నారు..అరోగ్యానికి హనికరమైన డ్రగ్స్ వాడినా ,అమ్మినా చట్టపరంగానేరమన్నారు.. ఈనేరగాళ్ళు భరితం పట్టేందుకు తాము తీవ్రంగా కృషిచేస్తున్నా మన్నారు. 14500పోన్ ద్వారా వారి ఉనికిని తమకు తెలియపరచా లన్నారు...

ఈ ర్యాలీ కార్యక్రమానికి సహకరించిన నారాయణ రావుకు కృతజ్ఞతలు తెలియపరిచారు...అన్ లైన్ మోసాలు కు గురవుతున్న నగర ప్రజలు ,బోగస్ పైనాన్స్ సంస్థలపట్ల అప్రమత్తంగా ఉండాలానీ సూచించారు..ఈ కార్యక్రమంలో పరవాడ సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు మరియు పోలీసు సిబ్బంది తదితర్లు పాల్గోన్నారు..

# క్రీడల్లో రాణిస్తున్న విద్యాకుసుమం

## - సునయనకి పలువురి అభినందనలు




కాకినాడ (విజయభాను న్యూస్) : ఓవైపు చదువుల్లో ముందడుగు వేస్తూ మరోవైపు క్రీడల్లో రాణిస్తున్న కాకినాడ విద్యార్థిని పీఎస్ఆర్ఎస్ దీప్తి సునయను పలువురు అభినందించారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో సునయన పలు పతకాలు సాధించింది. తాజాగా కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో జరిగిన పెంటథ్లాన్ లో సైతం విజేతగా నిలిచింది. రజత పతకాలు గెలిచింది. ఆదిత్యా విద్యాసంస్థల్లో ఇంటర్ చదువుతూ పలు క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదుగుతున్న క్రీడాకారిణి సునయన తీరుని పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ నెల 24, 25 వ తేదీల్లో రెండు రోజులపాటు జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పెంటథ్లాన్ పోటీల్లో బైథేల్, ట్రైథేల్ విభాగాల్లో దీప్తి సునయనకు రజత పతకాలు దక్కాయి. దాంతో ఆమె నేరుగా జాతీయ క్రీడలకు అర్హత సాధించింది. ఇప్పటికే ఆమె రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో విజేతగా పతకాలు దక్కించుకుంది. ఇప్పుడు పెంటథ్లాన్ లో సైతం రాణించడం పట్ల కోచ్, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ ప్రతాప్ నగర్ లో నివశిస్తున్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్ శివప్రసాద్ కుమార్తె దీప్తి సునయన చదువుల్లోనూ ముందంజలో నిలుస్తోంది. టెన్త్ పరీక్షల్లో 90 శాతం పైగా మార్కులు సాధించింది. ఇంటర్ కోసం ఆదిత్యాలో చేరింది. అటు క్రీడలు, ఇటు చదవుల్లో ఏకకాలంలో ప్రతిభ చాటుతున్న చిన్నారిని పలువురు అభినందించారు. మరింత రాణించి కాకినాడ కీర్తిని చాటాలని ఆశీర్వదించారు.

# రైతులకు వరం వై.యస్.ఆర్ పశు భీమా పధకం

## - జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : ఆంధ్రప్రదేశ్ లో రైతులకు పశు బీమా పథకం వరమని జిల్లా కలెక్టర్ డా ఎ. మల్లికార్జున అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో తన ఛాంబర్ లో వై.యస్.ఆర్ పశు భీమా పధకం గోడ పత్రిక మరియు కరపత్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పోషణ పై ఆధారపడిన పశుపోషకులకు ఆపత్కాలంలో పశు భీమా ఎంతగానో ఉపయోగ పడుతుంది అని తెలిపారు. రైతుల యొక్క పాడి పశువులు, జీవాలు ఆకస్మికంగా చనిపోయినప్పుడు నష్టపోతారని, కేవలం 20 శాతం భీమా సొమ్ము చెల్లించి పశువులకు భీమా చేయిస్తే అపదకాలంలో ఆసరా అవుతుందని పేర్కొన్నారు . కనుక రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అందించే 80 శాతం రాయితీని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా.రామకృష్ణ మాట్లాడుతూ కేవలం 384 రూపాయలు చెల్లిస్తే 30,000 రూపాయలకు 3 సంవత్సరాల కాలానికి భీమా చేసుకోవచ్చని, ఈ సదుపాయం గొర్రెలు, మేకలు, పందులు పెంపకం దారులకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. పశు భీమా కు సంబంధించి ఏదైనా సందేహాలు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1962 కు సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.కరుణాకరరావు, సహాయ సంచాలకులు డా.శ్రీనివాస్,డా.శ్రీనుబాబు డా.మాదిన ప్రసాదరావు మరియు డా.పూర్ణిమ పాల్గొన్నారు.

# షేర్లపై 12 శాతం డివిడెండ్ చెల్లింపు

**- వ్యాపార లక్ష్యం రూ.7728.43 కోట్లు**
**- రుణాలు లక్ష్యం రూ.3378.06 కోట్లు**
**- డిపాజిట్లు లక్ష్యం రూ.4350.37 కోట్లు**
**- వీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు**




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకులో సభ్యులు పెడుతున్న షేర్ మీద 12 శాతం డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించినట్టు బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. సోమవారం ద్వారకానగర్ లోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 శాతం డివిడెండ్ చెల్లింపు ద్వారా రూ.33.56 కోట్లు సభ్యుల ఖాతాలకు జమ చేసినట్టు పేర్కొన్నారు. బ్యాంకు సాధించిన లాభాలు, మిగులు నేపథ్యంలో రికార్డు స్థాయిలో డివిడెండు కూడా చెల్లించడం మంచి పరిణామ మన్నారు. గత ఏడాది 24 కోట్లు డివిడెండ్ను చెల్లించి నట్టు వివరించారు. గత రెండు సంవత్సరాలుగా బ్యాంకు వృద్ధి రేటు పాలకవర్గం ఆశించినట్లుగా లేనప్పటికీ క్రమేపీ వృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్టు రాఘవేంద్రరావు పేర్కొన్నారు. 2024 మార్చి 31 నాటికి రూ.7728.43 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. అలాగే రూ 4350.37 కోట్లు డిపాజిట్లు సేకరించాలని, రూ3378.06 కోట్లు రుణాలు అందజేయాలని కూడా లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు డిపాజిట్లు రూ. 3929 కోట్లు, రుణాలు, రూ.3052 కోట్లు, వ్యాపారం రూ.7026 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. బ్యాంకు సభ్యులు 92,831 మంది కాగా షేర్ ధనం రూ 305 కోట్లుగా నమోదు అయ్యిందన్నారు. షేర్ ధనంలో వీసీబీ దేశంలోనే నాలుగో స్థానాన్ని పొందిందన్నారు. అలాగే డిపాజిట్ల సేకరణలో 16వ స్థానం, రుణాల జారీలో 14వ స్థానం, నికర లాభాలు 9వ స్థానంలో బ్యాంకు నిలవడం అర్బన్ బ్యాంకింగ్ వ్యవస్థలో విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు స్థానాన్ని, దాని పటిష్ట స్థితిని తెలియజేస్తుందన్నారు. ఆర్థిక సంవత్సరానికి సభ్యులు సంఖ్య లక్షకు, షేర్ ధనం రూ.350 కోట్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.73.14 కోట్ల లాభాలు అర్జించినట్లు పేర్కొన్నారు. బ్యాంకు నిరర్థక ఆస్తుల సంఖ్యను కనిష్ట స్థాయికి తగ్గించాలని లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ ఆస్తుల సంఖ్య కొంత తగ్గినా వసూలు చేసిన మొత్తం పెరిగిం దన్నారు. ఐదా ఖాతాలు రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో నిరర్థక ఆస్తులు పెరుగుతున్నా యన్నారు. ఇందుకు సంబంధించి 33 ఖాతాలకు గాను 47 కోట్ల రూపాయలు బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. ఎమిరిటస్ చైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన చాలా సం- స్థలు అలా వ్యవహ రించడం లేదని, అదే బాటలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కూడా పని చేస్తుందని అన్నారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ గొప్పగా ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, వాస్తవానికి ఆ పరిస్థితి లేదన్నారు. సామాన్య ప్రజలు సేవింగ్స్ తగ్గాయన్నారు. ఎమిరిటస్ చైర్మన్ పదవి విషయంపై ఆయన మాట్లాడుతూ అనవసరంగా ఆర్బీఐ కొన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటోందన్నారు. ఎమిరిటస్ పదవి తొలగింపు అంశం ఆర్బీఐకు సంబంధించినది కాదన్నారు. ఈ విషయంపై ఆర్బీఐకు, బ్యాంకుకు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయన్నారు. అయితే తనకున్న ఎమిరిటస్ చైర్మన్ పదవి అంశం అంత పెద్ద విషయం కాదని, తాను డైరెక్టర్ అయినా ఉంటానని పేర్కొన్నారు.

తాను ఎమిరిటస్ చైర్మన్ ఉండాలని బ్యాంకు 108వ మహాజన సభలో తీవ్ర చర్చ జరిగిందని, అయితే ఈ అంశంలో అనివార్య పరిస్థితుల్లో పాలకవర్గం రిజర్వు బ్యాంకుతో ఘర్షణను నివారించే ఉద్దేశ్యంతో రిజర్వు బ్యాంకు ఆదేశాల అమలుకు నిర్ణయించి చైర్మన్ ఎమిరిటస్ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలని మానం ఆంజ నేయులు చేసిన ప్రతిపాదనను అంగీకరించాల్సిందిగా పాలకవర్గం తరపున మహాజన సభకు ప్రతిపాదిం చారు. ఈ సమావేశంలో...

సీనియర్ వైస్ చైర్మన్ జి. భాస్కరరావు, బ్యాంకు డైరెక్టర్లు ఎస్.నాగభూషణ చౌదరి, ఏ.జె.స్టాలిన్, ఎన్. కామరాజు, కే. భవాని, వి. చంద్రశేఖర్, జి. జనార్ధనరావు, సి. హెచ్. ఆది నారాయణ శాస్త్రి, ఎస్. జానకి రామచంద్రరావు, పి. వి. రమణరావు, కె.ప్రసాదరావు, యు. పార్వతీదేవి, జె.వి. సత్యనారాయణ మూర్తి, సి.హెచ్. కోటేశ్వర రావు, పి.నారాయణ స్వామి, పి.కృష్ణ మోహన్ రావు, ఎ. రామకృష్ణారావు, కో- ఆప్టెడ్ డైరెక్టర్ డి. బాబు రావు, కో ఆప్టెడ్ ఆర్. వైద్యనాథన్, బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణాధికారి పి.వి. నరసింహమూర్తి, బ్యాంకు జనరల్ మేనేజర్ ఎ.వి. రామకృష్ణారావు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లోనూ టౌన్ బ్యాంకు అగ్రస్థానం : బ్యాంక్ చైర్మన్ రవీంద్ర




కాకినాడ (విజయభాను న్యూస్) : ఖాతాదారులకు మేలైన సేవల్లోనూ ఆర్బీఐ నిబంధనలోనూ కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ అగ్రగామిగా నిలుస్తుందని అందుకు మా పాలకవర్గ సభ్యులతో పాటు ఉద్యోగులు, సిబ్బంది కారణమని బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర పేర్కొన్నారు కాకినాడ టౌన్ బ్యాంక్ పలు రంగాల్లో ముందున్నదంటూ నివేదికను విలేకరులకు ఆయన వివరించారు. కాకినాడలోని సిటీఇన్ హోటల్లో టౌన్ బ్యాంక్ చైర్మన్తో పాటు పాలకవర్గం సభ్యులు కలిసి సోమవారం బ్యాంక్ ప్రగతి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి 1039.13 కోట్లు బ్యాంక్ డిపాజిట్లు ఉండగా 682.82 కోట్లు రుణాలు గాను, పొదుపు రూపంలో 444.56 కోట్ల రూపాయలు ఉన్నాయన్నారు. బ్యాంకులో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 52 వేల 728 మంది సభ్యులు ఉండగా 29.89 కోట్ల వాటా ధనం కలిగి ఉందన్నారు. బ్యాంకుకు మార్చి 31వ తేదీ నాటికి 159.79 కోట్లు సొంత నిధులు ఉన్నట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 12. 39 కోట్లు లాభం వచ్చిందన్నారు. అలాగే ఎన్పిఎ గతేడాది 2.22శాతం ఉండగా ఈ ఏడాది మార్చి 31 నాటికి 1.21 శాతంగా ఉందన్నారు. అలాగే ఈ బ్యాంకు ఆడిట్ విభాగంలో ఏ గ్రేడ్ సాధించిందని తమ బ్యాంకు ఆర్బిఐ నిబంధనలకు అనుగుణంగా టైర్ 3లో నిలిచిందని చెప్పారు అలాగే తమ బ్యాంకు మరో రెండు రోజుల్లో గూగుల్, ఫోన్ పేల ద్వారా నగదును బదిలీ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తుందన్నారు. బ్యాంక్ ప్రధాన కార్యాలయం రామారావు పేటలో పాలక సభ్యులు, ఖాతాదారుల సౌకర్యార్థం లాకర్ల ప్లాజా నిర్మాణం కోసం బిల్డింగును సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వ, ఆర్బిఐ, ఖాతా దారులు సేవల్లోనూ కాకినాడ టౌన్ బ్యాంక్ ముందుందని రవీంద్ర పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ పాలకవర్గ సభ్యులు తోట సుధీర్, డాక్టర్ నున్న నరసింహారావు, గొల్లపూడి కృష్ణమూర్తి, గారపాటి అచ్యుత కళ్యాణ్ ప్రసాద్, కంటిపూడి వివి సత్యనారాయణ, డాక్టర్ పానుగంటి శ్రీనివాస ఠాగూర్, సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, బొల్లిన కృష్ణ స్వరూప్, ఎండి సుధీర్ కుమార్, అయ్యగారి వెంకటేష్, రెడ్డి వీర ప్రసాద్, పేపకాయల కృష్ణ, ఎన్ జనార్దన్ రెడ్డి, సీఈవో సి సుగుణ రావు తదితరులు పాల్గొన్నారు. బ్యాంకు ఖాతాదారుల సమావేశం మంగళవారం కాకినాడ గాంధీ నగర్లో ఉన్న యూనివర్సల్ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు రవీంద్ర చెప్పారు.

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



భీమునిపట్నం : విజయభాను న్యూస్. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం సి పి మరియు ఎస్ ఇ బి కమిషనర్ ఆదేశాల ప్రకారం, విశాఖపట్నం ఎస్ ఇ బి జాయింట్ డైరెక్టర్ సూచనల మేరకు భీమునిపట్నం ఎస్ ఇ బి స్టేషన్ ఆధ్వర్యంలో, స్టేషన్ పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆయా కళాశాలల్లో అధ్యాపకులు మరియు కాలేజి యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. మరియు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడదామని ప్రతిజ్ఞ చేయుంచి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం ఇన్ ఫోర్స్ మెంట్ సూపరిండెంట్ .శ్రీనాధుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు మరియు విద్యార్థులచే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు.అలాగే బీచ్ రోడ్ లో నవజీవన్ స్కూల్ విద్యార్థులు సంగివలస ఎన్ ఆర్ ఐ కాలేజీ విద్యార్థులు నిర్వహించారు .ఇందులో. సి ఐ రామకృష్ణ ఎస్ ఐ పద్మావతి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రపంచ మాదక ద్రవ్యాలు దినోత్సవం సందర్భంగా సోమవారం భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు భీమిలి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గంటస్థంబం వద్ద అధ్యాపకులు,విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమారాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.వి శ్రీనివాసరావు ,అప్పన్న బాబు, విశ్వనాథ్, రాంబాబు,సూరిబాబు,వృత్తివిద్యాఅధ్యాపకులు,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.వేణుగోపాల్,కె.ప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే తగరపువలస శ్రీ కృష్ణ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల యొక్క దుష్ప్రభావం గురించి విద్యార్థులను , యువతను దృష్టిలో పెట్టుకుని కాలేజీ కరెస్పాండంట్ బి నరసింగరావు ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె .చిట్టిరెడ్డి, ప్రిన్సిపాల్ జె. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ స్థానిక చిన్న బజార్ లో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్,వికాస్ తరంగిణి,మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో జూలై 1 న ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలిపారు. జులై 1 ఉదయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం1 వరకు నిర్వహించు ఈ కార్యక్రమంలో మహిళలకు మహిళా డాక్టర్స్ చే సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు,సర్వైకల్ క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు,రొమ్ము క్యాన్సర్ పరీక్షలునిర్వహించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఈ వ్యాధులు పై తగు సలహాలు,సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలి



రాజాం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు కు అనుగుణగా గ్రాట్యూటీ అమలు చెయ్యాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలను పెంపుదల చేయాలని పట్టుబట్టారు. వంగర మండలకేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలతో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ కు బడ్జెట్ పెంచాలి.

తదితర సమస్యల పరిష్కారం కై జూలై 10, 11 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యా లయం వద్ద జరుగు 36 గంటల ఆందోళనలో పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం



కాకినాడ (విజయభాను న్యూస్) : డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో నమోదు అయిన సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.కృతికాశుక్లా అధికారు లను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు డా. కృతికాశుక్లా సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ మండలాల నుంచి 19 మంది.. విద్య, ఉపాధి, భూ సర్వే, డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 1800425 3077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టరుకు నేరుగా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసు కునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్య క్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నా మన్నారు. ఫోన్ ద్వారా తెలియజేసిన 19 మంది వ్యక్తుల సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. అధికారులు డయల్ యువర్ కలెక్టర్ కార్యా లయంలో నమోదైన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పరిష్కరించాలని కలెక్టరు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ పీవీ చలపతిరావుకు నివాళులు అర్పించిన భాజపా నాయకులు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా బీజేపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ %మీాజ% స్వర్గీయ పీవీ చలపతిరావు గారి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రవీంద్ర మాట్లాడుతూ గురువుగారు పీవీ చలపతిరావు గారు మన మధ్య లేకపోవడం తీరని లోటని నిరంతరం పార్టీని బలోపేతపరచడమే ఆయన లక్ష్యంగా పనిచేశారని, వారు కోరుకున్న లక్ష్యాలను పొందేందుకు మనమంతా కలిసికట్టుగా పనిచేసి భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేద్దాం అని తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ వారి యొక్క ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ లో అధికారాన్ని చేపట్టడమే పీ వీ చలపతిరావుకి నిజమైన నివాళి అని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి పుట్ట గంగయ్య మాట్లాడుతూ స్వర్గీయ పీవీ చలపతి రావు గారు తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండా ఎన్నో కష్టనష్టాలను ఓరుస్తూ నిరంతరం పార్టీ కోసం పనిచేయడం జరిగిందని ఈనాటి ఎంతోమంది సీనియర్ నాయకులు ఆయన తయారు చేసిన వారమేనని ఎమర్జెన్సీ సమయంలో అండర్ గ్రౌండ్ లోకి వెళ్లి అనేక వేషధారణలు వేసి పోలీసులకు అప్పటి నిరంకుశ ప్రధాని ఇందిరా గాంధీ ప్రభుత్వానికి దొరక్కుండా ఉదయాన్నే నడవడంలో తనకు తానే సాటని ఎంతోమంది నాయకులకు వారి జీవితం ఒక స్ఫూర్తి దాయకమని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ ప్రార్థించాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలోబీజేపీ జిల్లా ఇన్చార్జి పుట్ట గంగయ్య, పార్వతీపురం జిల్లా ఇంచార్జ్ %ూఎూ% ప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాకుళం జిల్లా ఇన్చార్జి ఎన్ విజయానంద రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం దానేష్, సీనియర్ నాయకులు సన్యాసిరావు, వల్లూరి మోహన్ రావు, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# స్పందన కార్యక్రమంలో 9 అర్జీలు

**భీమునిపట్నం, విజయభాను న్యూస్ :** జోన్-1 , జీ వివిఎంసి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 9 అర్జీలు వచ్చినట్లు భీమిలి జోనల్ కమీషనర్ బొడ్డే పల్లి.రాము తెలిపారు. వీటిలోపట్టణ ప్రణాళిక విభాగంనకు- 2,ఇంజనీరింగ్ విభాగానికి - 7 వచ్చినట్లు చెప్పారు.తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందనీ ఆయన అన్నారు.

## నా జీవితమే నాకు పెద్ద లస్ట్ కాజోల్




'లస్ట్ స్టోరీస్ 2' విడుదలకు ముందే సంచలనాలు, వివాదాలకు కేంద్రమవుతోంది. నాలుగు భాగాలుగా వస్తున్న ఈ చిత్ర సంకలనాలకు అమిత్ ఆర్ శర్మ, ఆర్ బాల్కీ, సుజోయ్ ఘోష్, కొంకణాసేన్ శర్మ దర్శకులు. ఇందులో కాజోల్, మృణాల్ ఠాకూర్, తమన్నా భాటియా, విజయ్‌వర్మ, కుముద్ మిశ్రాలాంటి భారీ తారాగణం నటిస్తోంది. ఆశిష్ దువా, రోనీ స్క్రూవాలా నిర్మాతలు. ఈ లస్ట్ అనే పదంపైనే అభ్యంతరాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో కొందరు మీడియా ప్రతినిధులు ఒక సమావేశంలో 'మీ ఉద్దేశంలో లస్ట్ అంటే ఏమిటి?' అని సీనియర్ నటి కాజోల్‌ని ఆదివారం ప్రశ్నించారు. దానికి ఆమె ప్రతిస్పందిస్తూ.. 'కామం, మోహం, విపరీతమైన కాంక్ష... ఇలా లస్ట్‌కి ఎవరికి నచ్చినట్టుగా అర్థం చెప్పుకుంటున్నారు. నా ఉద్దేశంలో లస్ట్ అంటే గాఢమైన కోరిక. అది ఏ విషయంలోనైనా కావొచ్చు. నావరకైతే నా జీవితమే నాకు పెద్ద లస్ట్. ఇష్టమైన ఫుడ్ తినడం, డ్యాన్స్ చేయడం, సంగీతం వినడం, కుట్లు అల్లికలు.. ఇవన్నీ నా లస్ట్‌లే. పిల్లలతో కలిసి ప్రతి క్షణాన్ని ఆస్వాదించడమూ ఆ కోవలోకే వస్తుంది' అంటూ చెప్పుకొచ్చారు.

## దేవర జోరు




ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ తెరకెక్కిస్తున్న యాక్షన్ చిత్రం 'దేవర'. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు.

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ తెరకెక్కిస్తున్న యాక్షన్ చిత్రం 'దేవర'. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో వేసిన ప్రత్యేక సెట్లో ఇటీవల ప్రారంభమైన సంగతి తెలిసిందే. రెండు వారాల పాటు సాగిన ఈ షెడ్యూల్ తాజాగా పూర్తయినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఓ కీలక వాటర్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించినట్లు సమాచారం. దీనికి హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ కెన్నీ బేట్స్ నేతృత్వం వహించినట్లు తెలుస్తోంది. ఈ చిత్ర తదుపరి షెడ్యూల్ వచ్చే నెలలో ప్రారంభం కానుందని ప్రచారం వినిపిస్తోంది. మాస్ యాక్షన్ కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రంలో తారక్ ఓ సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. ఇది పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. అనిరుధ్ స్వరాలందిస్తున్నారు. ఆర్.రత్నవేలు ఛాయాగ్రాహకుడు.

### కెప్టెన్‌గా రోహిత్‌శర్మ..
### కోహ్లీలా దూకుడుగా ఉండాలి : పాక్ మాజీ క్రికెటర్



టీమ్‌ఇండియా వచ్చేనెల వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనుంది. టెస్టు, వన్డే జట్లను బీసీసీఐ ప్రకటిం చింది. ఈ నేపథ్యంలో పాక్ మాజీ బ్యాటర్ కమ్రాన్ అక్మల్ స్పందించాడు. భారత కెప్టెన్ రోహిత్‌శర్మకు కీలక సూచనలు చేశాడు. టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీలా మైదానంలో రోహిత్ కూడా తన ఉనికిని చాటాలన్నాడు. "విండీస్ పర్యటనకు ఎంపికైన భారత జట్టు అన్ని విభాగాల్లో సమంగా ఉంది. ఇది సమతుల్య జట్టు. ఈ సిరీస్ భారత జట్టుకు మంచి ఆరంభం కావాలి. కెప్టెన్సీ నుంచి కోహ్లీ వైదొలిగిన తర్వాత టీమ్‌ఇండియా సారథిగా రోహిత్‌శర్మ గొప్పగానే రాణించాడు. కానీ అతడు మరింత మెరుగ్గా రాణించాలి. విరాట్ కోహ్లీ మాదిరిగా మైదానంలో తన ఉనికిని చాటుకోవాలి" అని అక్మల్ పేర్కొన్నాడు.

## 'ఆదిపురుష్'.. కొన్ని పాఠాలు..





ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్, కృతిసనన్, సైఫ్ అలీఖాన్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన 'ఆది పురుష్' చిత్రం ఇటీవలె విడుదలైంది. భారత ప్రేక్షకులే కాక, ప్రపంచ ప్రేక్షకులకు కూడా ఈ చిత్రాన్ని దగ్గర చేయాలని పెద్దఎత్తున ప్రచారం చేశారు. పాన్ ఇండియా పేరుతో ప్రపంచ థియేటర్లలో కూడా విడుదల చేశారు. సెలబ్రిటీలు, ప్రముఖ సంస్థలు కూడా ఈ సినిమా ప్రమోషన్లలో పెద్ద భూమిక పోషించాయి. భారీ ఎత్తున టికెట్లు కొనుగోలు చేశారు. ఎప్పుడో పాత రోజుల్లో మాదిరి బస్సుల్లో, పెద్ద పెద్ద ప్రత్యేక వాహనాల్లో సుదూరాల నుండి ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చారు. అయితే అదంతా మూన్నాళ్ల ముచ్చటే అయింది. నాలుగో రోజు నుండే కలెక్షన్లు తగ్గిపోయాయి. ఎందుకు? నటీనటుల వేషాధారణా? పేలవమైన సంభాషణలా? గ్రాఫిక్స్ మాయాజాలమా..? ఇవన్నీ కాదు..

ప్రదర్శనలు.. విమర్శలు.. ఇతిహాసాల ఆధారంగా ఉత్తర, దక్షిణ చిత్రసీమ నుండి ఎన్నో చిత్రాలు విడుదలయ్యాయి. ఏళ్లకు ఏళ్లు సీరియల్ రూపంలో కూడా నడిచాయి. అవన్నీ ఆయా ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలకు లోబడి ఉండేవి. అయినా విమర్శలు కొత్త కాదు.. దక్షిణాదిలో రామాయణ పాత్రలను చూసిన ప్రేక్షకులు చాన్నాళ్లు దూరదర్శన్‌లో ప్రదర్శించిన హిందీ రామాయణాన్ని అంగీకరించలేదు. ఆయా పాత్రల్లో నటించిన నటీనటుల వేషధారణపై చాలా విమర్శలు వచ్చాయి. ఎందుకు? భిన్న సంస్కృతి, సాంప్రదాయాల పట్టుకొమ్మ మన భారతదేశం. ఏ ప్రాంతానికా ప్రాంతం విశేషమైన విశిష్టలతో తులతూగుతూనే ఉంటుంది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలలో ప్రాబల్యంలో వున్న నమ్మకాలు ఆచారాలు, అలవాట్లుగా కూడా మారిపోతుంటాయి. అలాంటి వాటిల్లో ఏళ్లకు ఏళ్లుగా జనాల నరనరాన ఎక్కించేసిన పురాణాలు కూడా ఉంటాయి. రామాయణ, భారత, భాగవత కథలకు దేశమంతటా ఎంతో ప్రాధాన్యత ఇస్తారు.

అయితే, వాటి ప్రాచుర్యం అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు. తమ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న కథకు, పాత్రల రూపురేఖలకు ఏ మాత్రం భిన్నంగా ఉన్నా జనం హర్షించరు. ఆదిపురుష్ విషయంలో అదే జరిగింది!

**సెంటిమెంటు ఒక్కటే శ** సక్సెస్ సాధించలేదు! 'ఆది పురుష్' చిత్రానికి వస్తే.. రామాయణం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం భిన్న సంస్కృతులను పట్టించుకోకుండా ప్రపంచ వ్యాపితం చేయాలన్న అత్యుత్సాహం ఇక్కడ కొట్టొచ్చినట్లు కనబడుతోంది. రాముడు 'మీ వాడంటే.. మీవాడు' అంటూ ఒక వర్గం ప్రజలకు పెద్ద పీట వేసి సభలు, సన్మానాలు చేశారు. సాధువులు, స్వామీజీలతో రాముడి గొప్పతనం చెప్పించారు. మరో అడుగు ముందుకేసి హనుమంతుడికో సీటు అంటూ చాలా థియేటర్లలో ఓ కుర్చీ ఖాళీగా ఉంచారు.

కథలో బలం ఉన్నా లేకపోయినా భారీ బడ్జెట్ సినిమాలకి ఈ మధ్య ప్రచారాలు బాగానే చేస్తున్నారు. ఈ చిత్రం ప్రమోషన్స్ వాటన్నింటినీ మించిపోయింది. కానీ అనుకున్నదొకటి.. అయినదొకటి అన్న చందాన ఫలితం వచ్చింది. రాముడు, కృష్ణుడు, సీత, హనుమంతుడు, రావణుడు, దుర్యోధనుడు వంటి పాత్రలకు చిత్రసీమలో ఎప్పుడూ విశేష ఆదరణ ఉంటుంది. ఆయా పాత్రల వేషభాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు ప్రజల నాడిని పట్టుకునేవి. 'ఆది పురుష్'లో అదే లోపించింది. ప్రజల భావోద్వేగాలతో సంబంధం లేకుండా కథనం నడిచింది. ఇతిహాసమైనా.. చిత్రమైనా.. కథేదైనా ప్రజల సంస్కృతి, సాంప్ర దాయాలను అనుసరించి నడిచినప్పుడే ఆదరణ వుంటుంది. కేవలం భావోద్వేగాలతోనే నడిపించాలనుకునే ఏ కథైనా ఇలాగే బోర్లాపడుతుందని 'ఆది పురుష్' నేర్పిన గొప్ప పాఠం.

**భిన్న భావాలకు విరుద్ధంగా ... :** రామాయణంలోని పాత్రల రూపురేఖలను ఆయా ప్రాంతాలను బట్టి ప్రజలు తమదైన సద్ధతిలో ఊహిస్తారు. తమ సంస్కృతిలో ఒక భాగంగా భావిస్తారు. తాము రామాయణం రచించిన వాల్మీకి వంశస్తులమనేవారు, జాంబవంతుడు తమ మూల పురుషుడు అనేవారు, సీతాదేవీ ఇక్కడే చీర ఆరేసుకుంది.. రాముడు ఇక్కడే విశ్రమించాడు..

అని నమ్మేవారూ చాలామంది ఉంటారు. తాజాగా 'ఆది పురుష్' చిత్రాన్ని నేపాల్ దేశంలో నిషేధించడం వెనుక ఇటువంటి నమ్మకమే ఉంది. సీత తమ దేశంలో పుట్టిందని నేపాలీలు నమ్ముతారు. అంటే ఆ పాత్ర తమ ఇంటి ఆడపడుచుగా వారు భావిస్తారు. కానీ చిత్రంలో సీత పాత్రధారి ఓ సందర్భంలో 'భారత పుత్రిక'ను అని పలికిందని ఆ సంభాషణ వారి నమ్మకాలకు విరుద్ధంగా ఉంది కాబట్టి, ఆ చిత్రాన్ని తమ దేశంలో ప్రదర్శించకుండా అడ్డుకున్నామని ప్రకటించారు. ఇవన్నీ నమ్మకాలు.. ఎవరి నమ్మకాలు వారివి. కేవలం నమ్మకాల ఆధారంగా ప్రచారం, ప్రాచుర్యం పొందాలి అనుకున్నప్పుడు– ప్రజల్లో పాదుకుపోయిన విభిన్న సంస్కృతి ఏకరూప సంస్కృతిని ... లస్ట్‌స్టోరీస్ ...ంచదు.

### తమన్నా ఆన్‌స్క్రీన్ ఫస్ట్ కిస్..
## విజయ్ రియాక్షన్ ఏమిటంటే..?



2' కోసం తాను పెట్టుకున్న 'నో కిస్' పాలసీని మొట్టమొదటిసారి బ్రేక్ చేశారు నటి తమన్నా. ఈ యూత్‌ఫుల్, రొమాంటిక్ డ్రామాలో భాగంగా నటుడు, తన ప్రియుడు విజయ్ వర్మ తో ఆమె ఆన్‌స్క్రీన్‌పై ముద్దు సన్నివేశాల్లో కనిపించ నున్నారు. ఇదే విషయంపై తాజాగా విజయ్ వర్మ స్పందించారు. ఈ సిరీస్ కోసం 'నో కిస్' పాలసీని బ్రేక్ చేస్తున్నట్లు తమన్నా చెప్పినప్పుడు తన రియాక్షన్ ఏమిటో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "స్క్రిప్ట్ పనుల్లో భాగంగా సుజోయ్ ఘోష్ ఆఫీస్‌లో తమన్నాను కలిశా. అక్కడే మా మధ్య పరిచయం పెరిగింది. కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాలపై మేమిద్దరం మాట్లాడుకున్నాం. సుమారు 17 ఏళ్ల నుంచి తాను ఈ రంగంలో ఉన్నానని, తన కాంట్రాక్ట్‌లో తప్పకుండా 'నో కిస్' పాలసీని ఫాలో అవుతుంటానని, ఇప్పటివరకూ తాను ఇలాంటి ప్రాజెక్ట్ అస్సలు చేయలేదని తమన్నా నాతో చెప్పింది. అంతేకాకుండా, ఆన్‌స్క్రీన్‌లో తాను ముద్దు పెట్టుకోనున్న మొదటి నటుడిని నేనేనని చెప్పింది. ఆ మాట వినగానే.. 'థ్యాంక్యూ' అని బదులిచ్చా" అని విజయ్ వర్మ తెలిపారు. సుమారు 18 ఏళ్ల నుంచి తాను ఫాలో అవుతోన్న నో కిస్ పాలసీని బ్రేక్ చేయడంపై తమన్నా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. సుజోయ్ ఘోష్‌తో వర్క్ చేయాలని తాను ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, ఇలాంటి సబ్జెక్ట్ కోసం ఆయన దర్శకత్వంలో పనిచేయడం ఆనందంగా ఉందని అన్నారు. "ఒకప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడు వేరు. కాలానికి అనుగుణంగా మారే వ్యక్తుల్లో నేనూ ఒకదాన్ని. ఒక నటిగా సృజనాత్మకత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నా. సినీ ఇండస్ట్రీకి వచ్చిన 18 ఏళ్ల తర్వాత ఫేమస్ అవ్వాల్సిన అవసరం నాకు లేదు. నా ఉద్దేశం కూడా అది కాదు" అని ఆమె చెప్పారు. 2018లో విడుదలై, విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న వెబ్ సిరీస్‌ల్లో 'లస్ట్ స్టోరీస్' ఒకటి. ఇప్పుడు దానికి కొనసాగింపుగా 'లస్ట్‌స్టోరీస్ 2' వస్తోంది. కాజోల్, తమన్నా, మృణాల్ ఠాకూర్, విజయ్ వర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 4 విభిన్నమైన కథలతో రానున్న ఈ సిరీస్‌ను అమిత్ రవీంద్రనాథ్ శర్మ, కొంకణా సేన్ శర్మ, బాల్కి, సుజోయ్ ఘోష్ తెరకెక్కించారు. సుజోయ్ ఘోష్ చిత్రీకరించిన పార్ట్‌లో తమన్నా–విజయ్‌వర్మ ముఖ్య భూమికల్లో కనిపించనున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణలోనే వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది.

## జంధ్యాల అక్షరాలు తిని.. లక్షలు సంపాదించా: కోట



"జంధ్యాల అందించిన హాస్యం అమ్మ పాలైతే.. ఇప్పుడున్న కామెడీ డబ్బా పాలు అన్నారు" నటుడు కోట శ్రీనివాసరావు. నగరంలో నిర్వహించిన జంధ్యాల హ్యూమర్ సిటీ అవార్డుల వేడుకలో భాగంగా కోట శ్రీనివాస రావుకు జంధ్యాల జీవిత సాఫల్య పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జంధ్యాల అక్షరం తిని.. లక్షలు సంపాదించిన నటుడ్ని నేను. జంధ్యాల తర్వాత ఆ స్థాయికి తీసుకెళ్లిన మరో దర్శకుడు రేలంగి నరసింహారావు' అని చెప్పారు. ఈ వేడుకలో దర్శకులు అనిల్ రావిపూడి, మారుతిలకు లీడర్స్ ఆఫ్ లాఫ్టర్ పురస్కారాలను, అలీ, గెటప్ శీను, సునయన తదితరులకు మాస్టర్ ఆఫ్ స్మైల్స్ అవార్డులను అందించారు. సినీ నటులు మురళీమోహన్, బాబూమోహన్, రేలంగి నరసింహారావు పాల్గొన్నారు.

### 1500 మందికిపైగా డ్యాన్సర్లతో
## సూర్య సందడి.. ఏ సినిమా కోసమంటే?



అగ్ర హీరోల సినిమా పాటలంటేనే ఓ రేంజ్‌లో ఉంటాయి. డ్యాన్స్‌కు ప్రాధాన్యమున్న సాంగ్స్ అయితే ఆ హంగామా ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రముఖ కథానాయకుడు సూర్య అలాంటి సందడే చేయనున్నారని టాక్. ఆయన హీరోగా దర్శకుడు శివ 'కంగువ' సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆదివారం.. ఓ పాటని షూట్ చేశారట. ఆ గీతానికి 1500 మందికిపైగా డ్యాన్సర్లతో కలిసి సూర్య స్టెప్పులేశారని కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఆ పాట సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. యాక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమాలో సూర్య సరసన దిశా పటానీ నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌కు అధిక ప్రాధాన్యమున్న ఈ సినిమా త్రీడీలో.. పది భాషల్లో వచ్చే ఏడాది విడుదల కానుంది. కంగువ అంటే అగ్ని శక్తి ఉన్న వ్యక్తి, పరాక్రమవంతుడు అని అర్థం.

## సూపర్ సిక్స్‌కు శ్రీలంక..



ఐసీసీ వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌లో శ్రీలంక హ్యాట్రిక్ విజయంతో సూపర్ సిక్స్ దశకు దూసుకెళ్లింది. దిముత్ కరుణరత్నె (103 బంతుల్లో 103) శతకానికి తోడు వానిందు హసరంగ (5/79) ఐదు వికెట్లతో చెలరేగడంతో ఆదివారం జరిగిన గ్రూప్–బి మ్యాచ్‌లో లంక 133 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.5 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. కరుణరత్నెతో పాటు సదీర సమరవిక్రమ (82), ధనంజయ డిసిల్వా (42 నాటౌట్), చరిత్ అసలంక (38) రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ ఎడైర్ (4/46), బారీ మెకార్తీ (3/56) సత్తా చాటారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 31 ఓవర్లలో 192 పరుగులకే కుప్పకూలింది. కర్టిస్ క్యాంఫర్ (39), హారీ టెక్టర్ (33), జార్జ్ డాక్రెల్ (26) తప్ప మిగతా ఆటగాళ్లు నిరాశ పరిచారు. హసరంగ ఐదు, మహేశ్ పతిరణ రెండు వికెట్లు పడగొట్టారు. కరుణరత్నెకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

## పృథ్వీతేజ్ ఇమ్మడి, సిఎండి, ఏపిఈపిడిసిఎల్




సీతమ్మధార(విజయభాను న్యూస్): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏపిఈపిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక మరియు అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా గోడ పత్రికలను సిఎండి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎండి పృథ్వీతేజ్ మాట్లాడుతూ దూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాల వల్ల తలెత్తే నష్టాలపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలై సామాజిక తిరస్కరణకు గురవుతున్న పిల్లలతో ఎలా వ్యవహరించాలి, మాదక ద్రవ్యాల దుర్వినియోగం నుంచి వారిని దూరంగా ఉంచాలనే దానిపై వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ వద్దు.. చదువే ముద్దు, మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు మోగిస్తాయి మరణ మృదంగాలు, మత్తులో జగత్తు.. జీవితం చిత్తు.., డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదాం.. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ను సాకారం చేద్దాం, సే నో టూ డ్రగ్స్ యువతా మేలుకో.. డ్రగ్స్ ను వదులుకో.. భవితను మలుచుకో, డ్రగ్స్ ఎండ్ అల్ డ్రీమ్స్, డ్రగ్స్ కు బానిస కావద్దు... కన్నవాళ్లకు కడుపుకోతను మిగల్చవద్దు... వంటి నినాదాలతో కూడిన గోడపత్రికలను సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఏ.వి.వి.సూర్యప్రతాప్, సిజిఎం అచ్చి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ ఏంటి డ్రగ్స్ అండ్ ఏంటి ఆల్కహాల్ కాంపెయిన్ కన్వీనర్ సురేష్ బేత,డాక్టర్ సంతోష్, లిఖిత్ బేత తదితరులతో కలిసి సిఎండి విడుదల చేసారు.

# "డయల్ యువర్ మేయర్" కు 14, "జగనన్న కు చెబుదాం"కు 86 వినతులు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** "డయల్ యువర్ మేయర్" కు 14, "జగనన్న కు చెబుదాం"కు 86 అర్జీలు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో "డయల్ యువర్ మేయర్", "జగనన్న కు చెబుదాం" కార్యక్రమాలలో జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ తో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ "డయల్ యువర్ మేయర్" కార్యక్రమంలో 14 అర్జీలు వచ్చాయని, వాటిలో విభాగాల వారీగా ఇంజినీరింగ్ కు 8, టౌన్ ప్లానింగ్ కు 1, డిసి(రెవెన్యూ) కు 1, పబ్లిక్ హెల్త్ కు 1, యుసిడి కు 3 వచ్చాయి. అలాగే "జగనన్న కు చెబుదాం" లో మొత్తం 86 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో రెండవ జోన్ కు 12, మూడువ జోన్ కు 6, నాల్గవ జోన్ కు 8, ఐదవ జోన్ కు 9, ఆరువ జోనుకు 21, ఏడవ జోన్ కు 1, ఎనిమిదివ జోన్ కు 10, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 19 ఫిర్యాదులు, మొత్తము 86 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన & అక్కౌంట్స్ కు 4, రెవెన్యూ కు 5, పబ్లిక్ హెల్త్ కు 13, టౌన్ ప్లానింగ్ కు 41, ఇంజినీరింగ్ కు 15, మొక్కల విభాగానికి 2, యుసిడి కు 6 ఫిర్యాదులు వచ్చాయి.

వాటిని పరిశీలించి ఆ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న "జగనన్న కు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో..., తరువాత వారం వచ్చే "జగనన్న కు చెబుదాం" కార్యక్రమానికి ముందుగా సమర్పించవలసిన వివరాలుతో ఆయా విభాగాధిపతులు సిద్ధం చేయాలని కమిషనర్ తెలిపారు. ఆయా వివరాలను తరువాత వారంలో సమర్పించడం వలన నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని ఆయన అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాస రావు, డాక్టర్ వి.సన్యాసి రావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, సిఎంఓహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డిసి(రెవెన్యు) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రావు, ఎఫ్.ఎ & ఎ.ఓ. మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్ రవి, వినయ్ కుమార్, వేణుగోపాల రావు, కృష్ణారావు, గోవింద రావు, రామ్మోహన్ రావు, డిపిఓ చక్రధర్, పి.ఓ.(యుసిడి) సూర్య కళ, డిసిపిలు, ఎసిపిలు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌ను కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్స్



తాడేపల్లి, **(విజయభాను న్యూస్) :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ క్యాడర్‌కు చెందిన 10 మంది ఐఏఎస్ ప్రొబేషనర్స్ (2022 బ్యాచ్) సోమవారం కలిశారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేలా పనిచేస్తూ, సామాన్యుడికి సైతం అందుబాటులో ఉంటూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లకు సీఎం మార్గనిర్ధేశం చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బి.స్మరణ్ రాజ్, బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కల్పశ్రీ కే.ఆర్, కుషల్ జైన్, మౌర్య భరద్వాజ్, రాఘవేంద్ర మీనా, సౌర్యమన్ పటేల్, తిరుమణి శ్రీ పూజ, వి.సంజనా సింహా ఉన్నారు.



# వైఎస్సార్ నేస్తం నిధులు విడుదల

## జిల్లాలో 601 మంది యువ న్యాయవాదులకు రూ.30 లక్షలు లబ్ధి – రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** న్యాయవాదులకు అండగా ఉండేందుకు వైఎస్సార్ నేస్తం తీసుకొచ్చామని , ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్న వారు వృత్తి జీవితంలో పేదలకు సాయపడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై .యస్ జగన్ మోహన్ రెడ్డి కోరారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 2,677 మంది యువ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ.5 వేల స్టయిఫండ్ చొప్పున 2023-24 సంవత్సరానికి మొదటివిడత 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక ప్రోత్సాహకాన్ని బటన్ నొక్కి విడుదల చేసారు.

ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ప్రారంభించగా, జిల్లా స్థాయిలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం విశాఖపట్నం జిల్లాలో జిల్లా వ్యాప్తంగా అర్హులైన 601 మంది యువ న్యాయవాదులకు రూ.30,05,000 /-. మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లిఖార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున మాట్లాడుతూ ఫిబ్రవరి –మే కు సంబంధించి రాష్ట్ర ముఖ్య మంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగిందన్నారు . జిల్లా లో సుమారు 601 మంది యువ న్యాయవాదులకు ఈ పథకం క్రింద రూ. 30,05,000 లబ్ధి చేకూరిందన్నారు. చదువు పూర్తి చేసుకొని న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన తరువాత తొలి మూడేళ్లు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తోడుగా ఉందనే భరోసా ఇవ్వడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు . ఇది వారికి వృత్తిలో స్థిరపడేందుకు దోహదం చేస్తుందన్నారు. జూనియర్ న్యాయవాది కె.అమల మాట్లాడుతూ తను ఏడాది నుంచి జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న అని చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తి అయ్యాక వైఎస్సార్ నేస్తం ఎంతో ఉపయోగపడిందన్నారు. జూనియర్ న్యాయవాది టి. సాయి ప్రియాంక మాట్లాడుతూ మేము తల్లితండ్రుల మీద ఆధారపడకుండా మాకు ఈ పథకం ఎంతగానో మేలు చేస్తుందన్నారు.

పాదయాత్ర హామీని ముఖ్యమంత్రి నెరవేర్చడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. జూనియర్ న్యాయవాది బి. గౌతమ్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటువంటి పథకాలను అమలు చేయటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలు వీటి వల్ల ప్రయోజనం పొందుతున్నారని సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి , డిఎల్ డిఓ పూర్ణిమ దేవి , యువ న్యాయవాదులు , తదితరులు పాల్గొన్నారు .

# మైక్రోప్లాస్టిక్‌పై మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభం




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో యూరోపియన్ కమీషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల 'మైక్రోప్లాస్టిక్స్ అనాలసిస్, మిటిగేషన్, మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్' శిక్షణ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. యూనివర్సిటీకి అందించిన పరిశోధన ప్రాజెక్టులో భాగంగా 15 మందికి ఈ అంశంపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. విశిష్ట అతిధి రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ సముద్ర జీవుల మనుగడ ఎంతో ప్రధానమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా దీనికి తీవ్ర నష్టం జరుగుతోందని, దీనిని నియంత్రించే విధానాలపై అధ్యయనాలు జరగాలని సూచించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం కన్వీనర్‌గా, గౌరవ ఆచార్యులు కె.ఉమాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం ఆచార్య ఇ.ఉదయ భాస్కర రెడ్డి, ఆచార్య సాల్మన్ రాజు, ఆచార్య మురళీకృష్ణ కుమార్, రవి ఈశ్వరపు తదితరులు ప్రత్యేక ప్రసంగాలు అందించారు. విభాగ అధ్యాపకులు ప్రాక్టికల్‌గా శిక్షణ అందించారు.

# గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించండి

## జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణలో నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పలు స్వచ్ఛంద సంస్థలను కోరారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో పలు స్వచ్ఛంద సంస్థలు, ఆర్.డబ్ల్యు.ఎస్, ఎన్.జి.ఓ.ఎస్, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి. ప్రతినిదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం ఉన్నందున గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అందించే ప్రసాదాలు, తీర్థ పానీయాలు ప్లాస్టిక్ కలిగిన వస్తువుల్లో అందించరాదని, అందుకు మీ సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా 500 మంది వాలంటీర్లను, అలాగే స్వచ్ఛంద సంస్థలు వీలైనంతవరకు ఎక్కువ మంది వాలంటీర్లను ఏర్పాటు చేసి గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు అందించే అన్న ప్రసాద వితరణ, తాగునీరు ప్లాస్టిక్ రహిత వస్తువులతో అందించాలన్నారు.

ప్రతి ప్రసాదం కౌంటర్ వద్ద డస్ట్ బిన్లు ఆయా స్వచ్ఛంద సంస్థలే ఏర్పాటు చేసుకోవడంతోపాటు వ్యర్థాలను డస్ట్ బిన్ లో వేసే విధంగా వాలంటీర్ల సహకారంతో అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఏ ఏ ప్రాంతాలలో తమ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే యు.ఎన్.డి.పి. కన్సల్టెంట్ రాజామణికి తెలియజేయాలన్నారు. 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు గిరి ప్రదక్షిణలో తప్పిపోకుండా జివిఎంసి టాగ్ లను ఏర్పాటు చేస్తుందని, ట్యాగ్ పై తల్లిదండ్రుల పేర్లతో పాటు ఫోన్ నెంబర్ రాయడం జరుగుతుందన్నారు. గిరి ప్రదక్షిణ 32 కిలోమీటర్ల పొడుగునా అక్కడక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే సింహాచలం కొండ మెట్లు మార్గాన మూడు చోట్ల వైద్య శిబిరం ఏర్పాటు అయ్యేలా చూడాలని ఆదేశించామన్నారు. తొలి పావంచి, కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంలో వాలంటీర్లను ఏర్పాటుచేసి భక్తులకు తాగునీరు అందించి, ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావును ఆదేశించారు. గిరి ప్రదక్షిణలో ఎటువంటి తోపులాట్లు లేకుండా రద్దీ నియంత్రణకు వాలంటీర్లను ఎక్కువగా ఉపయోగించుకోవాలన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com